



హౌసింగ్‌బోర్డు ఎల్ఐజీ బస్టాప్ వద్ద 25 తలలు, 50 హస్తాలతో గణనాథుడి దర్శనం



పాతూరు అమ్మవారిశాలలో దశావతార గణపతి



సప్తగిరి సర్కిల్‌లో భక్తజన సందోహం



అరవిందనగర్‌లో వెండి కమలాలతో...



నీరుగంటి వీధిలో గరుడవాహనంపై..



వేణుగోపాల్‌నగర్‌లో వనవిహార రూపంలో..

భజే.. బొజ్జ గణపయ్యా..

- భక్తిశ్రద్ధలతో వినాయక చవితి
- వాడవాడలా వెలసిన విగ్రహాలు

అనంతపురం టౌన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పార్వతీ తనయుడు తొలిపూజ అందుకున్నాడు. పల్లెలు, పట్టణాలు అనే తేడాలేకుండా వీధివీధినా బొజ్జ గణపయ్య కొలువై భక్తకోటికి కనువిందు చేశాడు. వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లావ్యాప్తంగా ప్రజలు వేడుకలను ఘనంగా చేసుకున్నారు. జిల్లా కేంద్రంలో కేఎస్ఆర్ ప్రభుత్వ బాలికల కళాశాల ముందు గణేష్ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో భారీ సెట్టింగులతో ఏర్పాటు చేసిన మండపానికి పతాకాన్ని ఆవిష్కరించి, వేడుకలను ప్రారంభించారు. అనంతరం గణనాథుని ఉత్సవ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. గజాననుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాత్రికి విగ్రహాల కదలికలతో కర్ణాటక రాష్ట్రం కారణగిరి శ్రీ సిద్ధి వినాయక స్వామి ఆలయ పురాణగాథను ప్రదర్శించారు. చాలా ప్రాంతాల్లో ఈ ఏడాది ప్రత్యేకించి ఆపరేషన్ సిందూర్ ఘట్టాలను ప్రదర్శించగా, మిగిలిన చోట్ల పర్యావరణ ప్రాశస్త్యాన్ని తెలియజేస్తూ ఎకో ఫ్రెండ్లీ వినాయకులను కొలువుదీర్చారు. ఇలా జిల్లావ్యాప్తంగా వాడవాడలా వెలసిన వినాయక మండపాలన్నింటిలోనూ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించగా... చిన్న, పెద్ద తేడాలేకుండా అందరూ గణనాథుని మండపాలకు చేరుకుని, వివిధ రూపాల్లో కొలువైన స్వామివారిని దర్శించుకున్నారు.

థర్డ్ డిగ్రీ..!





చెయ్యి కోసుకున్న ప్రకాష్‌ను వైద్యం కోసం ఎత్తుకెళ్తున్న పోలీసులు

- నిందితులను చితకబాదుతున్న పోలీసులు
- తాళలేక ఆత్మహత్యలకు యత్నిస్తున్న బాధితులు
- కట్టుతప్పుతున్న ఖాకీల ట్రీట్‌మెంట్
- జరుగుతున్న ఘటనలే ఉదాహరణ

అనంతపురం క్రైం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): కొందరు పోలీసులు థర్డ్ డిగ్రీ పేరుతో చితకబాదుతుండటంతో నిందితులు కొందరు ఆత్మహత్యలకు యత్నిస్తున్నారు. పోలీస్‌స్టేషన్లలో లాఠీ దెబ్బలు తినడం కంటే చావడమే మేలు అన్నట్లుగా కత్తులతో కుత్తుకలు, చేతులు స్టేషన్ పరిసరాల్లోనే కోసుకునే పరిస్థితికి వస్తున్నారు. మూడు రోజులు కిందట కంబదూరు మండలంలో జరిగిన సంఘటనే ఇందుకు నిదర్శనం.

గంజాయి కేసేస్తాం!

కంబదూరులోని వడ్డే కాలనీలో ఉంటున్న ప్రకాష్ చిల్లర కొట్టు నిర్వహించేవాడు. అప్పులు అధికం కావడంతో కొట్టు బంద్ చేసినట్లు సమాచారం. అయితే ప్రకాష్ తల్లి స్థానిక తహసీల్దార్ కార్యాలయం దగ్గర అంగడిపెట్టుకుని కర్ణాటక నుంచి మద్యం తెప్పించి విక్రయిస్తున్నట్లు పోలీసులకు సమాచారం ఉంది. ఈ క్రమంలో పోలీసులు సుమారు 20 నుంచి 28 వరకూ టెట్రా ప్యాకెట్లు దొరికాయని, తల్లి స్థానంలో ప్రకాష్‌ను మూడు రోజుల కిందట స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఉదయం నుంచి రాత్రి వరకూ ఉంచుకున్నారు. ఈక్రమంలోనే థర్డ్ డిగ్రీ పేరుతో బాగానే కోటింగ్ ఇచ్చారట. రాత్రి 10 గంటలకు వదిలేసి, ఉదయం రావాలని హెచ్చరించినట్లు తెలిసింది. కేసు లేకుండా చేయాలంటే డబ్బులు ఇవ్వాలని లేదా 4 కేసుల మద్యం తెచ్చివ్వాలంటూ హెచ్చరించినట్లు సమాచారం. 'మీరు అడిగింది మేం చేయలేం సార్' అంటూ ఆయన పోలీసులకు చెప్పినట్లు తెలిసింది. దీంతో చిర్రెత్తుకొచ్చిన పోలీసులు 'ఏయ్ గంజాయి కేసు పెట్టి, లోపల వేసి 4 నెలలు రిమాండ్‌కు పంపుతాం' అంటూ బెదిరించారట. దీంతో అప్పటికే దెబ్బలతో ఒళ్లు హూనం కావడం, గంజాయి కేసు, రిమాండ్ అనే సరికి తీవ్ర ఆందోళన చెందిన ప్రకాష్ కూరగాయలు కోసే చాకుతో స్టేషన్ వద్దే తన ఎడమ చెయ్యి కోసుకున్నాడు. దీంతో పోలీసుల్లో టెన్షన్ మొదలైంది. ప్రకాష్‌ను వైద్యం కోసం దగ్గర్లో ఉన్న కళ్యాణదుర్గం పట్టణంలో కాకుండా హుటాహుటిన అనంతపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. విషయం బయటకు పొక్కకుండా గోప్యంగా ఉంచారు.

తాడిపత్రిలోనూ ఇదే సీన్

సుమారు నెల కిందట తాడిపత్రి పోలీసులు ఓ కేసుకు సంబంధించి ఇద్దరు వైసీపీ కార్యకర్తలను స్టేషన్‌కు పిలిచినట్లు సమాచారం. ఓ కేసు విషయంలో చితకొట్టారు. ఆ థర్డ్ డిగ్రీ దెబ్బలకు ఆ ఇద్దరు భీతిల్లిపోయారు. మళ్లీ కొన్ని రోజులకు ఆ ఇద్దరినీ స్టేషన్‌కు పిలిచారు. అప్పటికే పోలీసుల లాఠీ దెబ్బలకు ఉక్కిరిబిక్కిరైన వాళ్లను అనంతపురం తీసుకెళ్తారని తెలిసింది. దీంతో ఆ ఇద్దరిలో ఒక నిందితుడు ఇక వేధింపులు భరించడం తన వల్ల కాదంటూ తన వద్ద ఉన్న చాకుతో గొంతు కోసుకున్నట్లు సమాచారం. దీంతో తాడిపత్రి పోలీసులు హుటాహుటిని బాధితుడిని అనంతపురం తీసుకొచ్చి రహస్యంగా వైద్య చికిత్సలు అందించినట్లు తెలిసింది. విచారణ పేరుతో స్టేషన్‌కు తీసుకువచ్చి ఇలా పోలీసుల థర్డ్ డిగ్రీ ప్రయోగిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. థర్డ్ డిగ్రీ అధికారం ఏ డిగ్రీ ఇచ్చిందని సామాన్య జనం ప్రశ్నిస్తున్నారు. మరి థర్డ్ డిగ్రీ పోలీసులపై ఉన్నతాధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో..?

మాటల్లో పెట్టి.. మాయ..!

బస్సుల్లో చోరీ చేసే మహిళల ముఠా అరెస్టు

రూ.23 లక్షల విలువైన బంగారం ఆభరణాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ జగదీష్ (7లో...)

శుభం..!

- నేటితో ముగియనున్న ఎంబీబీఎస్ కౌన్సెలింగ్
- 170కు 165సీట్లు కేటాయింపు
- రిపోర్ట్ చేసిన మొత్తం విద్యార్థులు

(వివరాలు 6లో...)

బాదుడు..!

బాదు పేరుతో వేరుశనగలో అధిక తూకాలు

- పాల్తూరులో రైతులను మోసం చేస్తున్న వ్యాపారులు
- 40 కిలోల బస్తాకు 8 కిలోల బాదుపై రైతుల ఆగ్రహం

(వివరాలు 6లో...)

పింఛన్ పంపిణీకి సాకులు..!

వెలుగు సీసీల మారాం..!

- తప్పించుకునే ప్రయత్నాలు
- వంతపాడుతున్న ఉన్నతాధికారులు
- అనంతపురం రూరల్‌లో వింత పరిస్థితి

అనంతపురంరూరల్, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెడుతోంది. తొలిరోజే పూర్తి చేసేలా అన్ని శాఖలను భాగస్వామ్యం చేస్తోంది. వలంటీర్లు లేకున్నా.. విజయవంతంగా పూర్తి చేస్తోంది. ఇతర శాఖల సిబ్బంది, ఉద్యోగులు పింఛన్ పంపిణీ చేస్తుంటే.. సొంత శాఖవారే ఎగ్గొట్టే ఎత్తుగడలు వేస్తున్నారు. అనంతపురం రూరల్ మండలంలో వెలుగు సీసీలే సాకులు చెప్పి, తప్పించుకోవాలని చూస్తుండడం శోచనీయం. ఇందుకు ఉన్నతాధికారులు కూడా వంతపాడుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వీరి వ్యవహారంతో ప్రతినెలా మండల అధికారులు తలలు పట్టుకుంటున్నారు.

ఇదీ పరిస్థితి..

రూరల్ మండలంలో ఎన్టీఆర్ భరోసా పింఛన్లు 17,678 ఉన్నాయి. లబ్ధిదారులకు ప్రతినెలా రూ.7.87కోట్లు పంపిణీ చేస్తారు. ఇందులో సచివాలయ, ఇతర శాఖల ఉద్యోగులు పాల్గొంటున్నారు. మండలంలో 283 క్లస్టర్లుగా విభజించి, పంపిణీ చేస్తున్నారు. ఒక్కో ఉద్యోగికి వందలోపు పింఛన్లు పంపిణీ చేసే బాధ్యత అప్పగిస్తున్నారు. ఉదయం 7 గంటలకు మొదలు పెట్టినా మధ్యాహ్నం లోపు పంపిణీ పూర్తి చేసే ఉద్యోగులు ఉన్నారు. సర్వర్ సక్రమంగా పనిచేస్తే పంపిణీ ప్రారంభించిన రెండు, మూడు గంటల్లోపే పూర్తి చేయవచ్చని కొందరు ఉద్యోగులు అంటున్నారు. వీటిని పంపిణీ చేసేందుకు కొందరు ఉద్యోగులు బద్ధకంగా ఫీలవుతున్నారు. వెలుగు సీసీలు సాకులు వెతుకుతున్నారని తెలుస్తోంది. పింఛన్ల పంపిణీ అనగానే.. అబ్బా అంటున్నట్లు తెలుస్తోంది. పింఛన్లు ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో వీరి సేవలను మండల అధికారులు వినియోగించుకుంటున్నారు. వీరు సాకులు చెబుతుండడం, ఉన్నతాధికారులు వంతపాడుతుండడంతో మండల అధికారులు ప్రతినెలా తలలు పట్టుకుంటున్నారు. ఒక్కొక్కరు ఒక్కో కారణంతో పింఛన్ల పంపిణీ నుంచి తప్పించుకుంటున్నారు.

వంత పాడుతున్న అధికారులు

పింఛన్ల పంపిణీ వాస్తవానికి డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో చేపడతారు. సొంత శాఖకు సంబంధించిన కార్యక్రమంలో పాల్గొనేందుకు సీసీలు మారాం చేస్తున్నారు. మండలంలో ఐదుగురు సీసీలు ఉన్నారు. వీరిలో ఇప్పటికే ఒకరిద్దరు ఆరోగ్యపరమైన సమస్యలతో ఇబ్బంది పడుతున్నట్లు తెలుస్తోంది. మిగతావారు కూడా పింఛన్ల పంపిణీలో పాల్గొనమంటూ బెట్టు చేస్తున్నట్లు ఆయా వర్గాల ద్వారా తెలుస్తోంది. శాఖపరంగా ఇతర పనులు ఏవైనా ఎక్కువగా ఉన్నాయా అంటే.. అదీలేదని తెలుస్తోంది. సదరు ఉద్యోగులకు సంబంధిత అధికారులు సైతం వంత పాడుతుండటంతోనే ఈ పరిస్థితి తలెత్తుతోందన్న వాదనలు వినిపిస్తున్నాయి.

సమస్య ఉండటంతోనే వెళ్లడం లేదు



మండలంలో ఐదుగురు సీసీలు ఉన్నారు. వీరిలో ఇద్దరు కాలు విరిగి ఇబ్బంది పడుతున్నారు. మిగిలిన ముగ్గురిలో ఒకరు ఆరోగ్యం బాగోలేదని 1, 2 తేదీల్లో సెలవు పెట్టారు. మిగిలిన ఇద్దరు పింఛన్ల పంపిణీకి వెళ్లారు.

-రవి, ఏపీఎం, అనంతపురంరూరల్ మండలం

పాల్గొనాలని చెప్పాం



అనారోగ్య సమస్యలతో వెలుగు ఉద్యోగులు పింఛన్ల పంపిణీకి రాలేమని చెబుతున్నట్లు నా దృష్టికి వచ్చింది. అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్న వారిని మినహాయించి ఇతరులను కార్యక్రమంలో పాల్గొనేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించాం.

-దివాకర్, ఎంపీడీఓ, అనంతపురం రూరల్

పింఛన్ల పంపిణీకి సన్నద్ధం కావాలి

- వీసీలో కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీకి సన్నద్ధం కావాలని కలెక్టర్ వినోద్‌కుమార్.. సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం క్యాంపు కార్యాలయం నుంచి పింఛన్ల పంపిణీకి సంబంధించి డీఆర్‌డీఏ పీడీ శైలజ, ఎల్డీఎం, జడ్పీ సీఈఓ, డీఎస్ఓ, ఆర్డీఓలు, అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ... జిల్లాలో సెప్టెంబరు 1న ఉదయం 7గంటలకే పింఛన్ల పంపిణీ ప్రారంభించాలన్నారు. లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పంపిణీ చేయాలన్నారు. పింఛన్ల పంపిణీకి కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. దీర్ఘకాలిక సెలవులో వెళ్లిపోయిన సచివాలయ ఉద్యోగులకు సంబంధించి నివేదిక అందించాలన్నారు. అన్ని ఎఫ్‌పీ షాపులకు పెండింగ్ లేకుండా రేషన్ సరుకులను అందజేయాలన్నారు. 65 సంవత్సరాల పైబడిన వారు, దివ్యాంగులు, మంచానికే పరిమితమైన వారికి ఇంటి వద్దకే వెళ్లి రేషన్ పంపిణీ చేయాలని ఆదేశించారు.

ప్రత్యామ్నాయం ఎప్పుడో..?

- విత్తనాల పంపిణీపై నిర్లక్ష్యం
- నెల ప్రారంభంలోనే ప్రతిపాదనలు
- నేటికీ సబ్సిడీ ధరలు ఖరారు చేయని వైనం
- రైతులకు తప్పని నిరీక్షణ

6 లో

ప్రాణాలు తీసుకున్నారు..!

ఉమ్మడి జిల్లాలో ఐదుగురి ఆత్మహత్య

బాధిత కుటుంబాల్లో విషాదం

7 లో

మద్యం మత్తులో వీరంగం

రెండు వర్గాల ఘర్షణ

చికిత్స పొందుతూ మరోసారి గొడవ

అడ్డు వచ్చిన డాక్టర్, వైద్యసిబ్బందిపై దాడి

(వివరాలు 7వ పేజీలో..)

పరిశీలన ప్రారంభం

- డీఎస్సీ ఎంపిక అభ్యర్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్
- పీవీకేకేలో ప్రత్యేక కమిటీల ఆధ్వర్యంలో ప్రక్రియ
- 807పోస్టులకు తొలిరోజు 625 మందికే మెసేజ్‌లు
- సాయంత్రానికి మరో 124మందికి, 58కి పెండింగ్..
- రాత్రివరకు కొనసాగిన పరిశీలన.. డీఈఓ పర్యవేక్షణ



సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌ను పర్యవేక్షిస్తున్న డీఈఓ ప్రసాద్‌బాబు, డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డి

అనంతపురం విద్య, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): డీఎస్సీ-2025 టీచర్ల నియామకాల ప్రక్రియ చివర దశకు చేరుకుంది. ఫలితాలు విడుదల చేయడంతో పాటు మెరిట్ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక జాబితాను రాష్ట్ర విద్యాశాఖ సిద్ధం చేసింది. రాష్ట్రశాఖ షెడ్యూల్ మేరకు ఎంపికైన అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన గురువారం మొదలు పెట్టారు. జిల్లా కేంద్రం శివారు పీవీకేకే ఎంబీఏ కళాశాలలో వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టారు. దీంతో అర్హత జాబితాలో ఉండి, మెసేజ్‌లు వచ్చిన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లను కమిటీలకు చూపించి వెరిఫికేషన్ చేయించుకున్నారు. అభ్యర్థుల వెంట వారి కుటుంబ సభ్యులు కూడా రావడంతో పీవీకేకే కాలశాల కిటకిటలాడింది.

తొలిరోజు 625 మందికే..

ఉమ్మడి జిల్లాలో 807టీచర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. ఈమేరకు అభ్యర్థులను ఎంపిక చేసి పంపాలి. ఈసారి రాష్ట్ర శాఖనే ఎంపిక జాబితాను రూపొందించి అర్హత ఉన్న అభ్యర్థులకు మెసేజ్‌లు పంపింది. తొలిరోజు 625మందికే ఎంపిక మెసేజ్‌లు పంపారు. వారు మాత్రమే సర్టిఫికెట్ల పరిశీలనకు వచ్చారు. దీంతో ఇతర అభ్యర్థుల్లో ఆందోళన (మిగతా 6లో..)

నేడు ఎన్టీఆర్, పరిటాల రవి విగ్రహాల ఆవిష్కరణ



పెనుకొండలో పరిటాల రవి విగ్రహావిష్కరణకు పరిటాల సునీతను ఆహ్వానిస్తున్న టీడీపీ నాయకులు

రామగిరి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్, మాజీ మంత్రి పరిటాల రవీంద్ర కాంస్యవిగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్‌లు పిలుపునిచ్చారు. వారు గురువారం విలేకరులతో మాట్లాడుతూ రామగిరిలో శుక్రవారం పరిటాల రవీంద్ర జయంతి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా రామగిరి టీడీపీ కార్యాలయంలో ఎన్టీఆర్, పరిటాల రవీంద్ర కాంస్య విగ్రహాలను ఆవిష్కరిస్తామన్నారు. అలాగే మెగా రక్తదాన శిబిరం, వైద్యశిబిరాన్ని ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు. పరిటాల రవీంద్ర జయంతి సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అలాగే పెనుకొండలో శనివారం పరిటాల రవీంద్ర విగ్రహావిష్కరణ చేస్తున్న నేపథ్యంలో ఆ కార్యక్రమానికి హాజరు కావాలని ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్‌ను అక్కడి నాయకులు ప్రత్యేకంగా ఆహ్వానించారు. కాగా విగ్రహావిష్కరణ చేపడుతున్న మంత్రి సవితకు పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్‌లు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఏర్పాట్ల పరిశీలన

విగ్రహాల ఆవిష్కరణ, రక్తదాన శిబిరం ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్, పరిటాల సిద్ధార్థ గురువారం సాయంత్రం పరిశీలించారు. అన్నదాన కార్యక్రమానికి సంబంధించి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని సూచించారు. కాగా గత మూడు రోజుల నుంచి టీడీపీ సీనియర్ నాయకులు, పరిటాల అభిమానులు దగ్గరుండి ఏర్పాట్లను చురుకుగా చేపట్టారు.

సూపర్‌వైజర్ పోస్టులకు నోటిఫికేషన్

అనంతపురం విద్య, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వయోజన విద్యాశాఖలో రాష్ట్ర వ్యాప్తంగా ఖాళీగా ఉన్న సూపర్‌వైజర్ పోస్టుల భర్తీకి ఆశాఖ రాష్ట్ర కమిషనర్ గురువారం నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న కదిరి, పెనుకొండ పోస్టుల భర్తీ అనంతపురం కలెక్టరు ఆధ్వర్యంలో జరగనుంది. ఈ సూపర్‌వైజర్ పోస్టులకు ఎస్‌జీటీ కేడర్ వారు మాత్రమే అర్హులని నిర్ణయించారు. షెడ్యూల్ మేరకు ఈనెల 30 నుంచి సెప్టెంబరు 5 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. ఆరున స్క్రూట్నీ చేస్తారు. 9న ఇంటర్వ్యూలు నిర్వహించాల్సి ఉంటుంది. ఆ తర్వాత ఎంపికైన అభ్యర్థులను కలెక్టరు ప్రటించనున్నారు. దీంతో నోటిఫికేషన్ అమలుకు గురువారమే కలెక్టరు ఆమోదం కోసం ఫైల్ పెట్టినట్లు జిల్లా వయోజవిద్యశాఖ డీడీ వెంకటేశ్వర్లు తెలిపారు.

పతక యోగం..!

రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో జిల్లాకు పతకాల పంట



జాతీయ పోటీలకు ఎంపికైన వారిని అభినందిస్తున్న డీఎస్‌డీఓ, అధికారులు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో జిల్లాకు పతకాల పంట పండింది. ఇటీవల తూర్పుగోదావరి జిల్లా తాడేపల్లి గూడెంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి యోగా పోటీల్లో జిల్లావాసులు పతకాలు సాధించి, జాతీయ పోటీలకు అర్హత సాధించారు. కేఎల్‌కే బాబు, యోగాంజలి, వెంకటరాముడు స్వర్ణ పతకాలు కైవసం చేసుకున్నారు. పరమేశ్వర రెడ్డి, నవీన్, పులిబాబు, సుబ్బరాయుడు, కీర్తి, ప్రగతి రజతాలు కొల్లగొట్టారు. వీరు సెప్టెంబరు 11వ తేదీ నుంచి చత్తీస్‌ఘడ్‌లోని బిలాయ్‌లో, సెప్టెంబరు 27 నుంచి విజయవాడలలో నిర్వహించే జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని డీఎస్‌డీఓ ఉదయ్‌భాస్కర్ తెలిపారు. పతకాలు సాధించిన వారిని డీఎస్‌డీఓతోపాటు ఆర్అండ్‌బీ ఎస్ఈ సంజీవయ్య, జిల్లా యోగా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు రాజశేఖర్ రెడ్డి, మారుతీప్రసాద్ అభినందించారు.

ప్రతి పంచాయతీలో ఎన్టీఆర్ విగ్రహం

- మంత్రి సవిత
- పెద్దమంతూరులో ఆస్పత్రి నిర్మాణానికి భూమిపూజ



పెద్దమంతూరులో ఆరోగ్యకేంద్రం భూమిపూజలో పాల్గొన్న మంత్రి, టీడీపీ నాయకులు

రొద్దం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పెనుకొండ నియోజకవర్గంలో ప్రతి పంచాయతీలోనూ ఎన్టీఆర్ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత పేర్కొన్నారు. మండలంలోని పెద్దమంతూరు లో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం నిర్మాణానికి గురువారం ఆమె భూమిపూజ చేశారు. రొప్పాల గ్రామంలో ప్రధాన రహదారి పక్కనే దివంగత ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేపట్టారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ అభివృద్ధి అంటే టీడీపీ, టీడీపీ అంటే అభివృద్ధి అనేలా చర్యలు తీసుకుంటామన్నారు. సూపర్‌సిక్స్ పథకాల అమలులో భాగంగా ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం సూపర్‌హిట్ అయిందన్నారు. రొద్దం మండలంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయన్నారు. చిన్నకోడిపల్లి గ్రామానికి పెన్నానదిపై బ్రిడ్జి నిర్మాణ పనులను త్వరలో ప్రారంభిస్తామన్నారు. పెనుకొండలో నూతన టీడీపీ కార్యాలయాన్ని నిర్మిస్తామని తెలిపారు. సోమందేపల్లిలో ఎన్టీఆర్ విగ్రహాన్ని ఆవిష్కరించేందుకు ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కోసం ఎదురు చూస్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఉదయ్‌శంకర్‌రాజు, ఎంపీడీఓ రాంకుమార్, ఆర్అండ్‌బీ ఈఈ సంజీవయ్య, డీఈ వెంకటరామిరెడ్డి, టీడీపీ నాయకులు మాధవనాయుడు, చిన్నప్పయ్య, చంద్రమౌళి, నరహరి, వెంకటరామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. కాగా పెద్దమంతూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో 8, 9, 10తరగతి విద్యార్థులు 120 మందికి మంత్రి సవిత ఎస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్ తరఫున డెయిరీలు పంపిణీ చేశారు. విద్యార్థులతో సహపంక్తి భోజనం చేశారు.

బాదుడు..!

- బాదు పేరుతో వేరుశనగలో అధిక తూకాలు
- పాల్తూరులో రైతులను మోసం చేస్తున్న వ్యాపారులు
- 40 కిలోల బస్తాకు 8 కిలోల బాదుపై రైతుల ఆగ్రహం
- అన్నదాతలను బెదిరించి వెనుదిరిగిన వ్యాపారులు

విడపనకల్లు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రైతులు చమటోడ్చి పండించిన పంటను కొందరు అప్పనంగా 'బాదే'స్తున్నారు. న్యాయంగా తూచాల్సిన ధాన్యాన్ని బాదు పేరుతో అధికంగా తూచి అన్నదాతకు నష్టం కలుగజేస్తున్నారు. 40 కిలోల బస్తాపై బాదు పేరుతో కొన్ని, కన్నుగప్పి మరి కొన్ని మొత్తం 7 నుంచి 8 కిలోలు వ్యాపారులు కాజేయడాన్ని గమనించిన రైతులు వారిపై తిరగబడ్డారు. ఈ సంఘటన మండలంలోని పాల్తూరులో బుధవారం జరిగింది. మండలంలోని పాల్తూరు, ఉండబండ, గ్రామాల్లో బోరు బావుల కింద ఏప్రిల్ నెలలో దాదాపుగా రెండు వేల ఎకరాల్లో వేరుశనగ పంట సాగు చేశారు. దిగుబడి బాగా రావడంతో దానిపై వ్యాపారులు, దళారులు కన్ను పడింది. పాల్తూరు గ్రామానికి చెందిన నాగరాజు గౌడ్, ఎర్రిస్వామిగౌడ్‌లు నార్పలకు చెందిన వ్యాపారులతో కలిసి మోసం చేసేందుకు యత్నిస్తున్నారని రైతులు వారితో వాగ్వాదానికి దిగారు. 40 కిలోల బస్తాకు ఒక కిలో లేదా ఒకటిన్నర కిలోలు తీసుకుంటే మా పంట అమ్ముతాము లేదంటే ఒక్క కాయను కూడా ఇవ్వం అంటూ పలువురు రైతులు ఎదురు తిరిగారు. చేసేది లేక వ్యాపారులు ఓ రైతు వద్ద మాత్రమే కొనుగోలు చేసుకుని వెళ్లిపోయారు. ధర హెచ్చుతగ్గులు, భయపెట్టే వాతావరణంతోనే రైతులు దళారులను ఆశ్రయించి నష్టపోతున్నారు.



వేరుశనగ కాయలను తూకం వేస్తున్న హమాలీలు



రైతుల ఎదురుగానే 45 కేజీలు తూకం పట్టిన వ్యాపారులు



వ్యాపారులతో వాగ్వాదానికి దిగిన రైతులు

ఒక్కో రైతు నుంచి లక్షల్లో దోపిడీ

మూడు ఎకరాల్లో 60 క్వింటాళ్ల వేరుశనగ పండించిన రైతు నుంచి వ్యాపారులు బాదు పేరుతో క్వింటాకు దాదాపు 20 కిలోలు కాజేస్తున్నారు. ఇలా 60 క్వింటాళ్లకు 12 క్వింటాళ్లు అప్పనంగా దోచేస్తున్నారు. క్వింటా రూ. ఆరు వేలు ప్రకారం అనుకున్నా 12 క్వింటాళ్లకు రూ. 72వేలు రైతు నుంచి దోచుకుంటున్నారు. ఇలా పంట దిగుబడి పెరిగే కొద్ది దళారీలు, వ్యాపారుల దోపిడీ కూడా పెరిగిపోతోంది. రైతులు అడిగిన ధర ఇస్తే నష్టాలు వచ్చి మందు తాగి చావాలి అంటూ పాల్తూరు రైతులపై కొందరు వ్యాపారులు ఎదురు దాడికి దిగారు. ఎక్కడి నుంచో వచ్చి మీ దగ్గర పంట కొనుగోలు చేసి, వాటిని విక్రయించుకోవాలంటే మేం అడిగిన బాదు ఇవ్వాల్సిందే లేదంటే మీ ఇష్టం అంటూ పరుషంగా మాట్లాడారు. హమాలీల ఖర్చులు, లారీ బాడుగలు, వచ్చిపోయే ఖర్చులు అన్ని మీరే భరించండి అంటూ రైతులను బెదిరించడం వ్యాపారులకు రివాజుగా మారింది.

8 కేజీలు బాదు అడుగుతున్నారు



అధిక పెట్టుబడులు పెట్టి పంట పండించా. ఇప్పుడు దళారీలు వచ్చి కాయలు బాగా లేవు. 40 కిలోల బస్తాకు 8 కిలోల బాదు ఇవ్వాలని లేదంటే మాకు మీ సరుకు వద్దు అంటూ బెదిరిస్తున్నారు. వర్షాలు వచ్చే అవకాశాలు ఉండటంతో పొలాల్లో పంటను వేసుకుని ఉండలేని పరిస్థితి. వ్యాపారులు అడిగినకాడికి కాయలు పట్టిస్తే నాకు దాదాపుగా రూ. 2.5లక్షలు వరకూ నష్టం వస్తుంది. ఈ మోసాలను అధికారులే అరికట్టాలి.

-మారయ్య, రైతు, పాల్తూరు

రూ. రెండు లక్షల నష్టం



నేను 10 ఎకరాల్లో వేరుశనగ సాగు చేశా. నాకు ఎకరాకు 20 క్వింటాళ్లకు పైగా దిగుబడి వచ్చింది. చేసేది లేక దళారులు, వ్యాపారులు అడిగిన కాటికి ఇచ్చి దాదాపుగా రూ.2లక్షల వరకూ నష్టపోయా. మా గ్రామంలోని కొంతమంది వ్యాపారులే మట్టి పెళ్లలు ఉన్నాయని, కట్టి పుల్లలు ఉన్నాయని ధరలను తగ్గించి, బాదును కూడా ఎక్కువ తీసుకుని మోసం చేస్తున్నారు.

-మల్లికార్జున, రైతు, పాల్తూరు

క్రిమినల్ కేసులు పెడతాం



రైతులు పండించిన పంటలను అధిక తూకాలతో మోసం చేసే వ్యాపారులపై క్రిమినల్ కేసులు నమోదుచేస్తాం. వ్యాపారులు తూకాలు వేసిన తరువాత అనుమానం వచ్చిన వెంటనే రైతులు మరో తూనికను తెచ్చి తూకం వేయాలి. వ్యాపారులు ఎక్కడి వెళ్లకుండా నిలిపివేసి తూనికలు, కొలతల అధికారులుకు తెలియజేస్తే వెంటనే వచ్చి వ్యాపారులు, దళారులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం. వారి వాహనాలను సీజ్ చేస్తాం.

-శంకర్, తూనికలు కొలతల అధికారి

అర్హులకు పింఛన్లు ఇచ్చేలా చర్యలు

- కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో అర్హులకు పింఛన్లు అందించేలా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ఏపీ సచివాలయంలోని సీఎస్ కాన్ఫరెన్స్ హాల్ నుంచి గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ కలెక్టర్లతో సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్, జేసీ శివనారాయణశర్మ తదితరులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ... వికలాంగుల పింఛన్లకు సంబంధించి 7113 మందిని అనర్హులుగా గుర్తించి నోటీసులు ఇచ్చామన్నారు. తిరిగి పరిశీలించి అర్హులైన వారందరికీ పింఛన్లు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. జిల్లాలో పీఎం కుసుమ్ కింద 111 మెగావాట్ల సోలార్ జనరేషన్ కోసం అవసరమైన 499 ఎకరాలకు సంబంధించి భూ సమస్యలను వారం రోజుల్లో పరిష్కరిస్తామన్నారు.

ఇన్‌చార్జ్ సబ్‌రిజిస్ట్రార్‌గా ఇస్మాయిల్

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రామ్‌నగర్ జాయింట్-1 సబ్‌రిజిస్ట్రార్ రమణరావు 10రోజులపాటు సెలవులోకి వెళ్లారు. దీంతో ఆయన స్థానంలో సీనియర్ అసిస్టెంట్ ఇస్మాయిల్‌ను నియమించారు. గురువారం ఆయన ఇన్‌చార్జ్‌గా బాధ్యతలు చేపట్టారు.

నేడు పంచాయతీ పురోగతి సూచికపై శిక్షణ

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): పంచాయతీల పురోగతి సూచిక 1.0పై శుక్రవారం ఉమ్మడి జిల్లాలోని జడ్పీటీసీలు, డీఎల్‌పీఓలు, డీడీఓలు, ఎంపీడీఓలకు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు జడ్పీ సీఈఓ శివశంకర్ ప్రకటనలో తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఆవరణలోని జిల్లా పంచాయతీ వనరుల కేంద్రంలో శిక్షణ ఉంటుందన్నారు.

శుభం..!

- నేటితో ముగియనున్న ఎంబీబీఎస్ కౌన్సెలింగ్
- 170కు 165 సీట్లు కేటాయింపు
- రిపోర్ట్ చేసిన మొత్తం విద్యార్థులు

అనంతపురం వైద్యం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ సైన్స్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో రాష్ట్ర కోటా కింద చేపట్టిన ఎంబీబీఎస్ 2025-26 ప్రవేశాల మొదటి విడత కౌన్సెలింగ్ శుక్రవారంతో ముగియ నుంది. అనంతపురం వైద్య కళాశాలలో 200 ఎంబీబీఎస్ సీట్లకు గాను ఆల్ ఇండియా కోటా కింద 15శాతం మేరకు 30 సీట్లకు ఇటీవల కౌన్సెలింగ్ నిర్వహించిన విషయం తెలిసిందే. రాష్ట్ర కోటాకింద మిగిలిన 170సీట్లకు గాను 165 సీట్లను కేటాయించారు. ఇందులో భాగంగా నిర్వహించిన కౌన్సెలింగ్‌కు మొత్తం 165మంది విద్యార్థులు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ షారోన్ సోనియ తెలిపారు. మంగళవారం 54మంది విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరుకాగా మిగిలిన విద్యార్థులందరూ గురువారం రిపోర్ట్ చేసినట్లు అకడమిక్ వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శంకర్ నాయక్ వివరించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ మధు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు నీరజ, జగదీష్‌కుమార్, లలిభవాని, సుధీర్‌కుమార్, శ్రీనివాసులు, స్వాతి, రేవతి, కృష్ణవేణి, ఏఓ చౌడేశ్వరి, అధికారులు షర్మిల, సురేష్, మౌల, రాధ, నారపరెడ్డి, ప్రవీణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



సర్టిఫికెట్లను పరిశీలిస్తున్న అడ్మిన్ వైస్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ శంకర్ నాయక్

5 సీట్లు స్పెషల్ కేటగిరీ

ఆల్ ఇండియా కోటా కింద పోగా మిగిలిన 170 ఎంబీబీఎస్ సీట్లకు 165సీట్లను మొదటి విడత కింద కేటాయించారు. మిగిలిన ఐదు సీట్లు పీహెచ్, క్యాప్, స్పోర్ట్స్ వంటి స్పెషల్ కేటగిరి కింద కేటాయిస్తారని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. మొదటి విడతగా కేటాయించిన 165సీట్ల జాబితాలో చివరగా పీహెచ్ కేటగిరిలో రెండు సీట్లను. క్యాప్(నాన్‌లోకల్), బీఎస్‌ఎజీ కేటగిరి కింద ఒక్కో సీటును కేటాయించారు. అధికారుల పేర్కొంటున్న స్పెషల్ కేటగిరీని కూడా 165లో కలిపేశారు. మరి ఐదు సీట్లు ఏవిధంగా భర్తీ చేస్తారని విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. వర్సిటీ విడుదల చేసిన అలాంట్‌మెంట్ జాబితాలో నీట్ మార్కుల వారిగా 540 నుంచి 405 మార్కుల వరకు ఓసీ, బీసీ, ఎస్సీ, ఎస్టీ ఇలా రిజర్వేషన్ కేటగిరీ వారిగా 161సీట్లను ప్రదర్శించారు. మిగిలిన నాలుగు స్పెషల్ కేటగిరీ, నాన్‌లోకల్ కింద కేటాయించినట్లు స్పష్టమౌతోంది. ఈ అంశంపై కళాశాల అధికార వర్గాలు స్పష్టత ఇవ్వడంలేదని సీట్లురాని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ప్రత్యామ్నాయం ఎప్పుడో..?

- విత్తనాల పంపిణీపై నిర్లక్ష్యం
- నెల ప్రారంభంలోనే ప్రతిపాదనలు
- నేటికీ సబ్సిడీ ధరలు ఖరారు చేయని వైనం
- రైతులకు తప్పని నిరీక్షణ

↓ ఆత్మకూరు వద్ద పంట సాగుకు సిద్ధం చేసిన పొలం



అనంతపురం అర్బన్/పుట్లూరు, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ప్రత్యామ్నాయ విత్తనాలు ఎప్పటిలోగా పంపిణీ చేస్తారో తెలియని అయోమయం నెలకొంది. ఈ ఏడాది ఖరీఫ్‌లో వర్షాభావంతో ఆశించిన స్థాయిలో వేరుశనగ, ఇతర రకాల పంటలు సాగు చేయలేకపోయారు. ఈ నేపథ్యంలో ఆగస్టు ఆరంభంలోనే ప్రత్యామ్నాయ విత్తనాల కోసం జిల్లా వ్యవసాయ యంత్రాంగం రాష్ట్ర కమిషనరేట్‌కు ప్రతిపాదనలు పంపింది. నేటికీ పంపిణీపై ఆలోచనే చేయకపోవడం విమర్శలకు తావిస్తోంది. సబ్సిడీ విత్తనాల కోసం రైతులు నిరీక్షిస్తున్నారు.

గతేడాది మూడో వారంలోనే..

గతేడాది ఆగస్టు రెండో వారంలో ప్రత్యామ్నాయ పంటల విత్తనాల సబ్సిడీ ధరలు ఖరారు చేశారు. మూడో వారం నుంచి 80 శాతం సబ్సిడీతో విత్తనాలు పంపిణీ చేశారు. ఈసారి ఖరీఫ్‌లో వర్షాభావ పరిస్థితుల్లో ప్రధాన పంటలు ఆశించిన స్థాయిలో సాగు కాలేదు. జిల్లాలో 48,240 హెక్టార్లలో ప్రత్యామ్నాయ విత్తనాలు సాగు చేసేందుకు 9,245 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని ప్రతిపాదనలు పంపారు. ఉలవలు 5,945, పెసలు 1504, అలసంద 1050, కొర్ర 262, జొన్నలు 484 క్వింటాళ్లు అవసరమని పేర్కొన్నారు. ఇప్పటిదాకా సబ్సిడీ ధరలు కూడా ఖరారు చేయకపోవడం గమనార్హం. గతేడాది తరహాలో మూడో వారంలోనే విత్తనాలు పంపిణీ చేసి ఉండుంటే ఇప్పటికే రైతులు సాగు చేసేవారన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. సెప్టెంబరు 4వ తేదీదాకా జిల్లాలోతేలిక పాటి వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ స్పష్టం చేసింది. వాతావరణ పరిస్థితులు అనుకూలించి, పొలాల్లో తేమ ఆరిన తర్వాత ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసేందుకు రైతులు సిద్ధంగా ఉన్నారు. అప్పటిలోగా సబ్సిడీ విత్తనం ఇవ్వకపోతే బహిరంగ మార్కెట్‌లో కొనుగోలు చేసేందుకు కొందరు రైతులు సిద్ధమవుతున్నారు. చిన్న, సన్నకారు రైతులు ప్రభుత్వం అందించే సబ్సిడీ విత్తనాల కోసం ఎదురుచూస్తున్నారు. ఇప్పటికైనా విత్తనాల పంపిణీపై ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. లేదంటే రైతులు నష్టపోయే ప్రమాదం ఉంది.

వర్షాభావంతో అరకొరగా సాగు..

ఈ ఏడాది ఖరీఫ్‌లో జిల్లా సరాసరి సాధారణ సాగు విస్తీర్ణం 3.43 లక్షల హెక్టార్లుగా నిర్ణయించారు. ఇందులో వేరుశనగ 1.82 లక్షల హెక్టార్లు, కంది 55,296, పత్తి 44 వేలు, ఆముదం 16,293, వరి 19,466, జొన్న 1,719, సజ్జ 2,054, మొక్కజొన్న 14,653, రాగి 69, కొర్ర 3,311, పెసలు 455 హెక్టార్లు, మిగతా విస్తీర్ణంలో ఉలవలు, మినుములు, అలసంద తదితర రకాల పంటలున్నాయి. ఈసారి ఆశించిన స్థాయిలో వానలు పడకపోవడంతో అరకొరగానే పంటలు సాగయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఇప్పటిదాకా 1.81 లక్షల హెక్టార్లలో (53 శాతం) మాత్రమే పంటలు వేశారు. ఇందులో వేరుశనగ 59 వేల హెక్టార్లల్లో మాత్రమే సాగైంది. మిగతా విస్తీర్ణంలో కంది, మొక్కజొన్న, ఆముదం, పత్తి, సజ్జల పంటలు సాగు చేశారు.

విత్తనాలు ఎప్పుడిస్తారో..?

రామాంజనేయులు, రైతు, పుట్లూరు



ప్రత్యామ్నాయ విత్తనాలు సబ్సిడీతో ఎప్పుడిస్తారో..? ఏమో అర్థం కావడం లేదు. 2 ఎకరాల్లో ఉలవ సాగు చేసేందుకు పొలాన్ని సిద్ధం చేసుకున్నా. ఈనెల రెండోవారంలో వానలు బాగా పడ్డాయి. పొలాల్లో పదునైంది. ప్రభుత్వం సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాలు అందిస్తుందని ఆశతో ఎదురుచూస్తున్నా. పంపిణీ చేసి ఉండుంటే.. ఇప్పటికే విత్తనం వేసేవాళ్లం. ఇప్పటికైనా పంపిణీ చేసి, ఆదుకోవాలి.

పెసర పంట వేయాలనుకుంటున్నా..



నాకున్న 2.50 ఎకరాల్లో పెసర పంట సాగు చేయాలనుకున్నా. ఈనెల రెండో వారంలో వానలు పడటంతో పొలంలో పదునైంది. పెసర పంట సాగు చేసేందుకు సేద్యం పనులు చేసుకున్నా. ప్రభుత్వం సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేస్తుందని ఎదురుచూస్తున్నాం. గతేడాది ఆగస్టు మూడో వారంలోనే సబ్సిడీతో విత్తనాలు ఇచ్చారు. ఈసారి ఇప్పటిదాకా ప్రత్యామ్నాయ విత్తనాలు ఇస్తామన్న మాటే వినిపించడం లేదు. ప్రభుత్వం ప్రత్యేక చొరవ తీసుకుని, సబ్సిడీతో ప్రత్యామ్నాయ విత్తనాలు పంపిణీ చేసి, ఆదుకోవాలి.

-గోపాల్ యాదవ్, రైతు, కందికాపుల, పుట్లూరు మండలం

నాలుగు గ్రామాల్లో మ్యాజిక్ డ్రెయిన్లు

- డ్వామా పీడీ సలీం బాషా

అనంతపురం అర్బన్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఇంటి ఆవరణాల్లో పరిశుభ్రతను పెంచేందుకు మ్యాజిక్ డ్రెయిన్‌ల నిర్మాణం కోసం జిల్లాలోని 4 గ్రామాలను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసినట్లు డ్వామా పీడీ సలీం బాషా గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర- స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా కూడేరు మండలంలోని ముద్దలాపురం, పెద్దవడుగూరు మండలం చిన్నవడుగూరు, గుమ్మఘట్ట మండలం 75- వీరాపురం, పామిడి మండలం నీలూరు గ్రామాలను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసినట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో మ్యాజిక్ డ్రైన్ల నిర్మాణం కోసం తగిన అంచనాలు తయారు చేసి పంపాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు వెల్లడించారు.

బాల్యవివాహాల నివారణపై దృష్టి పెట్టాలి: కలెక్టర్



అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల నివారణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కలెక్టర్ వినోద్ కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో బాల్యవివాహాల నివారణపై జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ.. బాల్యవివాహాల నిషేధంపై ప్రతి గ్రామంలో వాల్ పెయింటింగ్స్ వేయించాలని జడ్పీ సీఈఓను ఆదేశించారు. బాల్యవివాహాలపై నివేదిక ఇవ్వాలని పోలీసు శాఖను ఆదేశించారు. స్త్రీ, శిశు సంక్షేమ శాఖ పీడీ నాగమణి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా అభివృద్ధి సూచికను వివరించారు. సమావేశంలో అధికారులు పాల్గొన్నారు.



పరిశీలనకు హాజరైన అభ్యర్థులు

పరిశీలన ప్రారంభం

(5వ పేజీ తరువాయి)

నెలకొంది. పరిశీలనా కేంద్రం వద్దకు మెసేజ్‌లు రాని అభ్యర్థులు వచ్చి విద్యాశాఖ ఉన్నతాధికారులను కలిసి తమ సమస్య విన్నవించారు. కాగా జిల్లాకు వచ్చిన పరిశీలకులు జాయింట్ డైరెక్టరు సుబ్బారావు, డీఈఓ ప్రసాద్‌బాబు పర్యవేక్షణలో సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగింది. ప్రధానంగా కుల ధ్రువీకరణ పత్రాలపై సమస్యలు తలెత్తకుండా, స్పష్టత ఇవ్వడానికి వెల్ఫేర్, రెవెన్యూశాఖ అధికారులు అక్కడే ఉంటూ వచ్చారు. రాత్రి 8గంటల వరకు వెరిఫికేషన్ ప్రక్రియ సాగింది.

మరో 124మందికి మెసేజ్‌లు

డీఎస్సీలో అర్హత ఉన్న మరో 124మంది అభ్యర్థులకు గురువారం సాయంత్రానికి మెసేజ్‌లు వచ్చాయి. వీరందరికీ శుక్రవారం సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతుందని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. ఇప్పటివరకు 749మందికి మెసేజ్‌లు వచ్చాయి. ఇంకా 58మందికి రావాల్సి ఉందని వారికి కూడా శుక్రవారం తెల్లారేలోగా రావచ్చని డీఈఓ అన్నారు.

గైర్హాజరైన వారికి నేడు అవకాశం: డీఈఓ

డీఎస్సీ-2025 నియామకాలకు తొలిరోజు 625 మందికి కాల్‌లెటర్లు అందగా, సర్టిఫికెట్ల పరిశీలనకు 620 మంది హాజరయ్యారని డీఈఓ ప్రసాద్‌బాబు తెలిపారు. ఐదుగురు అభ్యర్థులు పరిశీలనకు గైర్హాజరయ్యారని, వీరికి శుక్రవారం అవకాశం ఇస్తామని అన్నారు. నిబంధనల మేరకు ఒరిజనల్ సర్టిఫికెట్లు తీసుకురావాలని సూచించారు. శుక్రవారం కూడా గైర్హాజరైతే జాబితా నుంచి వారి పేర్లను తొలగించే ప్రమాదం ఉంటుందని అన్నారు. మరో 132 మంది అభ్యర్థులకు గురువారం రాష్ట్ర శాఖ నుంచి కాల్ లెటర్లు వచ్చాయని తెలిపారు. వీరు కూడా శుక్రవారం జరిగే సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు ఒరిజనల్ సర్టిఫికెట్లతో రావాలని సూచించారు. నగరంలోని పీవీకేకే కాలేజీలో ఉదయం 9గంటలకు పరిశీలన ప్రారంభమౌతుందని తెలిపారు.

వలసలో ముగిసిన బతుకులు

జమ్మలమడుగు వద్ద బైక్‌ను ఢీకొట్టిన కారు

ఇద్దరు రొద్దం మండల కూలీలు మృతి



ఆంజనేయులు, శివకుమార్ (ఫైల్)



నివాళులు అర్పిస్తున్న మంత్రి సవిత

రొద్దం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): కడప జిల్లా జమ్మలమడుగు వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రొద్దం మండలం కంచిసముద్రం గ్రామానికి చెందిన వడ్డె ఆంజనేయులు(25), శ్యాపురం గ్రామానికి చెందిన శివకుమార్ యాదవ్(25) మృతిచెందారు. హంద్రీనీవా కాలువ పనులు చేసేందుకు వీరు కూలీలుగా వెళ్లారు. పని ప్రదేశం వద్ద భోజనం చేయడానికి మంచి నీరు లేకపోవడంతో తెచ్చుకునేందుకు బైక్‌పై బయలుదేరారు. ప్రధాన రహదారిపైకి బైక్ ఎక్కే సమయంలో వేగంగా వచ్చిన కారు ఢీకొట్టింది. దీంతో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతిచెందారు. మృతదేహాలను బుధవారం రాత్రి స్వగ్రామాలకు తీసుకువచ్చారు. పెనుకొండలో మంత్రి సవిత వారికి నివాళులు అర్పించారు. అంత్యక్రియల కోసం బాధిత కుటుంబాలకు నగదు సాయం అందించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆంజనేయులు భార్య మమత మూడు నెలల గర్భిణి. వీరికి మూడేళ్ల కూతురు ఉంది. ఈ ప్రమాదంతో బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదం అలుముకుంది. మృతులవి పేద కుటుంబాలని, ప్రభుత్వం ఆదుకోవాలని ప్రజలు విన్నవించారు.

మద్యం తాగి బైక్ నడుపుతూ..



తిమ్మప్ప (ఫైల్)

గుమ్మఘట్ట: మద్యం మత్తులో బైకు నడుపుతూ గోనబావి గ్రామానికి చెందిన తిమ్మప్ప(50) ప్రాణాలు కోల్పోయాడని పోలీసులు తెలిపారు. అతివేగంగా వెళుతూ గణేష్ అనే యువకుడిని బైక్‌తో ఢీకొట్టి.. తిమ్మప్ప కింద పడ్డాడు. తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన గణేష్ ను రాయదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పంది అడ్డు రావడంతో..

తాడిపత్రి: పట్టణంలోని టైలర్స్ కాలనీ సమీపంలో బుధవారం రాత్రి పంది అడ్డు రావడంతో బైక్ అదుపుతప్పి శామ్యూల్ అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స అనంతరం అనంతపురానికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడని హెడ్ కానిస్టేబుల్ వెంకటరాముడు తెలిపారు. నందలపాడుకు చెందిన శామ్యూల్ స్టీల్‌ప్లాంట్ కార్మికుడు. పుట్లూరు రోడ్డులోని ఓ ఫంక్షన్ హాలులో తన స్నేహితుడి కొడుకు పెళ్లికి వెళ్లి తిరిగి వస్తుండగా ప్రమాదం జరిగింది. ఆయన భార్య రాణి, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

బైక్ అదుపు తప్పి.. చేనేత కార్మికుడు..

ధర్మవరం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని దుర్గానగర్‌కు చెందిన అక్కం సతీశ్‌కుమార్(36) బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపారు. ఆయన తెలిపిన మేరకు... అక్కం సతీశ్‌కుమార్, అతడి భార్య కవిత చేనేత కార్మికులు అయితే బుధవారం రాత్రి 8-45 గంటలకు భోజనం చేయడానికి సిద్ధమవుతుండగా ఫోన్ రావడంతో ద్విచక్రవాహనంపై అక్కం సతీశ్‌కుమార్ బయటకు వెళ్లాడు. అదే సమయంలో అతడి తమ్ముడు అనిల్‌కుమార్ ఇంటి వద్దకు వచ్చాడు. సోదరుడు బయట ఉన్నాడని తెలుసుకుని ఫోన్ చేసి పెట్రోల్ తీసుకుని రమ్మన్నాడు. సతీశ్ కుమార్ పెట్రోల్ తీసుకుని వస్తూ టూటౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న చికెన్ సెంటర్ మలుపు వద్ద బైకును అదుపు చేయలేక కిందకు పడ్డాడు. తీవ్రంగా గాయపడిన అతడిని కుటుంబ సభ్యులే ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతుడి భార్య కవిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మృతుడికి భార్యతోపాటు కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ప్రైవేటు బస్సు ఢీకొని యువకుడు..

హిందూపురం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): ఓ ప్రైవేటు బస్సు ఢీకొనడంతో యువకుడు మృతి చెందిన సంఘటన హిందూపురం మండలం లో గురువారం రాత్రి జరిగింది. ద్విచక్రవాహనంపై హిందూపురం వస్తుండగా గౌరీబిదనూరు వెళ్తున్న ప్రైవేట్ బస్సు ఢీకొంది. దీంతో ద్విచక్రవాహనంపై వస్తున్న యువకుడు అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. మృతుడు పట్టణంలోని యర్రకొట్టాల ప్రాంతానికి చెందినవాడిగా పోలీసులు అనుమానిస్తున్నారు.

చికిత్స పొందుతూ బాలిక మృతి

ధర్మవరం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌షాక్‌తో గాయపడి, ఆస్పత్రిలో పొందుతున్న బాలిక బుధవారం సాయంత్రం మృతి చెందింది. టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా కనిగిరి మండలం పుణుగుడు గ్రామానికి చెందిన పొట్లూరు శ్రీహరి, రేష్మ దంపతుల పెద్దకుమార్తె వెంకటేశ్వరి(10), కుమారుడు భరత్‌కుమార్, చిన్నకుమార్తె రమ్యతో కలిసి పట్టణానికి మూడు నెలలక్రితం వలస వచ్చారు. శారదానగర్‌లో ఉంటున్నారు. శ్రీహరి బేల్దారి పనులకు వెళ్తుండేవాడు. గతనెల 14వ తేదీన చంద్రబాబునగర్‌లో మాయకుంట్ల జయచంద్రకు చెందిన ఇంటి నిర్మాణ పనులు చేస్తున్న సమయంలో పెద్ద కుమార్తె వెంకటేశ్వరి కూడా తల్లిదండ్రులతో పాటు వెళ్లింది. బాలిక మిద్దెపైన ఆడుకుంటూ 11 కేవీ విద్యుత్ వైర్లకు ప్రమాదవశాత్తు తగలడంతో కిందపడి గాయపడింది. వెంటనే తల్లిదండ్రులు.. బాలికను ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం అనంతపురం, అక్కడి నుంచి తిరుపతి రుయా ఆస్పత్రికి తరలించారు. ఈనెల 24వ తేదీన గుంటూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యం చేయిస్తుండగా బుధవారం చికిత్స పొందుతూ మృతిచెందింది. దీనిపై బాలిక తల్లిదండ్రులు గురువారం ఫిర్యాదు చేయడంతో కేసు దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ తెలిపారు.

శిక్షణకు ఇంజనీరింగ్ అధికారులు

అనంతపురం న్యూటౌన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): గ్రామీణ నీటి సరఫరా విభాగంలోని ఎస్ఈలు, ఈఈలు, డీఈలకు ఈఎన్‌సీ కార్యాలయంలో మూడు రోజులపాటు గ్రామీణ తాగునీటి పథకంపై శిక్షణ ఏర్పాటు చేశారు. ఉమ్మడి జిల్లా నుంచి ఎస్ఈ సురేష్‌తోపాటు శ్రీసత్యసాయి జిల్లా ఇన్‌చార్జి ఈఈ విజయ్‌భాస్కర్, డీఈలు శ్రీనివాసులు, శ్రీధర్ శిక్షణకు వెళ్లారు.

ప్రాణాలు తీసుకున్నారు..!

ఉమ్మడి జిల్లాలో ఐదుగురి ఆత్మహత్య

కుటుంబాల్లో విషాదం



ప్రియసాయి (ఫైల్)

పరిగి/బ్రహ్మసముద్రం/శెట్టూరు/తాడిపత్రి, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లాలో వేర్వేరుచోట్ల ఐదుగురు ఆత్మహత్య చేసుకున్నారు. ఆయా కుటుంబాల్లో విషాదం నింపారు. ఒంటరితనాన్ని భరించలేక పరిగి మండలం సేవామందిరంలోగల రాజేశ్వరి లేఅవుట్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని ప్రియసాయి (26) బుధవారం ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకుంది. జమేదార్ శ్రీనివాసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ప్రియసాయిని మూడేళ్ల క్రితం కడప జిల్లా రాజంపేటకు చెందిన వ్యక్తికిచ్చి పెళ్లి చేశారు. ఏడాదికే భర్తతో విడాకులు తీసుకుని, పుట్టింటికి చేరింది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని ఇంటి నుంచే (వర్క్ ఫ్రం హోమ్) చేస్తుండేది. తండ్రి సంపత్‌కుమార్ ట్రాఫిక్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో ఒంటరి జీవితం భరించలేక మనస్తాపం చెంది ఇంట్లో దూలానికి చున్నీతో ఉరేసుకుంది. సమాచారం అందుకున్న పోలీసులు.. ఘటనా స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని హిందూపురం ఆస్పత్రికి తరలించారు. తండ్రి సంపత్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు జమేదార్ తెలిపారు.

భర్త వేధింపులు భరించలేక..

భర్త వేధింపులు, నిర్లక్ష్యాన్ని భరించలేక బ్రహ్మసముద్రం మండలం పోలేపల్లికి చెందిన శాంతి (24) మంగళవారం రాత్రి ఇంట్లోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ నరేంద్రకుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పోలేపల్లికి చెందిన వ్యక్తితో శాంతికి వివాహమైంది. భర్త వేధించడం, సరిగా చూసుకోకపోవడంతో మనస్తాపం చెందిన ఆమె ఇంట్లోనే పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబీకులు రాయదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మరణించింది. శాంతికి 8 నెలల పాప ఉంది. ఆత్మహత్యపై కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నరేంద్ర కుమార్ తెలిపారు.

తాగుడుకు భార్య డబ్బు ఇవ్వలేదని..

మద్యం తాగడానికి భార్య డబ్బు ఇవ్వలేదని శెట్టూరు మండల కేంద్రానికి చెందిన శంకర (39) గురువారం ఇంట్లోనే ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. శంకర, లలిత దంపతులు కూలి పనులకు వెళ్తూ జీవనం సాగిస్తుండేవారు. శంకర తాగుడుకు బానిసయ్యాడు. కూలి చేస్తే వచ్చే డబ్బు శంకర తాగుడుకు ఖర్చు చేస్తుండేవాడు. భార్య వద్ద కూడా డబ్బు తీసుకునేవాడు. ఈ నేపథ్యంలో గురువారం మద్యం తాగడానికి భార్యను డబ్బులు అడిగాడు. తన వద్ద లేవని ఆమె చెప్పడంతో మనస్తాపం చెందిన శంకర ఇంట్లోనే ఉరేసుకుని, మరణించాడు. కాసేపటికి గుర్తించిన కుటుంబీకులకు పోలీసులకు సమాచారం అందించారు. శంకర భార్య లలిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్ఐ రాంభూపాల్ తెలిపారు.

వ్యసనాలకు బానిసై...

వ్యసనాలకు బానిసై శెట్టూరు మండల కేంద్రానికి చెందిన బోయ మల్లికార్జున (50) గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. బంధువులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఉదయం మల్లికార్జున.. తల్లిదండ్రుల వద్దకెళ్లి చెల్లెళ్లతో రాఖీలు కట్టించుకుని, ఇంటికొచ్చాడు. వ్యసనాలకు బానిసవడంతో మనస్తాపం చెంది మధ్యాహ్నం తన పొలంలోని వేపచెట్టుకు తాడుతో ఉరేసుకుని, మరణించాడు. అటుగా వెళ్లిన వారు గమనించి కుటుంబీకులకు సమాచారం అందించారు. వారు పొలానికెళ్లి మల్లికార్జున మృతదేహంపై పడి బోరున విలపించారు. మల్లికార్జునకు కడుపునొప్పితో బాధపడుతుండేవాడనీ, ఇటీవలే శస్త్రచికిత్స కూడా చేయించుకున్నట్లు బంధువులు తెలిపారు. మల్లికార్జున భార్య లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అప్పుల బాధతో..

తాడిపత్రి మండలం పులిప్రొద్దుటూరు గ్రామానికి చెందిన దూదేకుల హాజీవలి (35) అప్పులబాధ భరించలేక బుధవారం తెల్లవారుజామున ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని, ఆత్మహత్య చేసుకున్నాడు. తాడిపత్రి రూరల్ సీఐ శివగంగాధర్ రెడ్డి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. హాజీవలి వ్యాన్ కొనుగోలుకు పరిచయస్తుల వద్ద దాదాపు రూ.14లక్షలు అప్పులు చేశాడు. వ్యాన్‌ను అద్దెకు తిప్పేవాడు. కొంతకాలంగా బాడుగలు లేకపోవడంతో అప్పులు తీర్చలేకపోయాడు. రుణదాతల ఒత్తిళ్లు అధికమవడంతో మనస్తాపం చెందిన అతడు ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకుని, మరణించాడు. అతడి భార్య ముంతాజ్‌బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

మద్యం మత్తులో వీరంగం

రెండు వర్గాల ఘర్షణ

చికిత్స పొందుతూ మరోసారి గొడవ

అడ్డు వచ్చిన డాక్టర్, వైద్యసిబ్బందిపై దాడి



వైద్యసిబ్బందితో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

కదిరిఅర్బన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో రెండు వర్గాలు పరస్పరం దాడులు చేసుకున్నాయి. చికిత్స కోసం ఏరియా ఆసుపత్రికి వచ్చి, అక్కడ మరోసారి దాడులు చేసుకున్నారు. ఈక్రమంలో అడ్డొచ్చిన, వైద్యురాలు, సిబ్బందిపై కూడా దాడికి దిగిన ఘటన కదిరిలో గురువారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు మున్సిపాలిటీ పరిధిలోని కుటాగుళ్లకు చెందిన అనిల్‌కుమార్, సాయిగణేష్, రాజశేఖర్, భరత్, కార్తీక్, మణికంఠ, అశోక్, మరోవర్గం గిరినాయక్, చంప్లానాయక్, రెడ్డెప్పనాయక్ బుధవారం రాత్రి కుటాగుళ్లలోని బెల్టు షాపు వద్ద చిల్లర విషయంలో గొడవ పడ్డారు. పరస్పరం రాళ్లతో దాడి చేసుకున్నారు. దీంతో ఇరువర్గాల వారు గాయపడ్డారు. వారిని బంధువులు కదిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మరోసారి ఘర్షణ పడ్డారు. కొంతమంది డాక్టర్ గదిలోకి వెళ్లి తలుపులు వేసుకోగా, మరో వర్గం తలుపులు బద్దలు కొట్టి, లోపలున్నవారిపై దాడిచేశారు. అడ్డొచ్చిన డాక్టర్ శిరీష, స్టాఫ్‌నర్సు బాలమణి, ఎంఎన్‌ఓ దాదాపీర్, సెక్యూరిటీగార్డు ఈశ్వరయ్యపై కూడా దాడికి తెగబడి గాయపరిచారు. స్టాఫ్ నర్సుకు కుడిచేయి విరిగింది. డాక్టర్ డయల్ 100కు ఫోన్ చేయగా, పట్టణ సీఐ నారాయణరెడ్డి తన సిబ్బందితో వెళ్లి ఘర్షణ పడుతున్నవారిని అదుపులోకి తీసుకున్నారు. ఇరువర్గాల్లో 9మందిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

వైద్యుల నిరసన

విధుల్లో ఉన్న డాక్టర్, సిబ్బందిపై దాడిని నిరసిస్తూ ఆసుపత్రి వర్గాలు గురువారం ఆందోళన చేపట్టాయి. ఉదయం 9నుంచి 10గంటల వరకు విధులు బహిష్కరించారు. వారు మాట్లాడుతూ.. విధులు నిర్వహిస్తున్న వైద్యులు, సిబ్బందిపై దాడులకు పాల్పడటం హేయమైన చర్య అన్నారు. ఆందోళనలో ఆసుపత్రి ఇన్‌చార్జ్ సూపరింటెండెంట్ హుస్సేన్, డాక్టర్లు మధుసూదన్, అశోక్, రిషిత, వైద్యసిబ్బంది ఉన్నారు.

పార్టీకి ఆపాదించడం తగదు: ఎమ్మెల్యే కందికుంట

మద్యం మత్తులో అల్లరిమూకలు గొడవపడితే అది టీడీపీ కార్యకర్తలు, వైసీపీ కార్యకర్తలపై దాడి చేసినట్లు కొన్ని చానల్స్‌లో ప్రసారం చేయడం సరికాదని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ తెలిపారు. ఆయన గురువారం ఆసుపత్రిని సందర్శించి, సంఘటనపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. దుండగులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

రాజకీయాలకు తావులేదు: రత్న, ఎస్పీ

జిల్లా ఎస్పీ రత్న గురువారం కదిరి ప్రభుత్వ ఆసుపత్రిని సందర్శించారు. గొడవకు గల కారణాలకు పోలీస్ అధికారులతో ఆరాతీశారు. గొడవలో గాయపడి చికిత్స పొందుతున్నవారితో మాట్లాడారు. ఇందులో ఎలాంటి రాజకీయం లేదని, మద్యం మత్తులోనే దాడులు చేసుకున్నట్లు ఎస్పీ ఎదుట వారి కుటుంబ సభ్యులు తెలిపారు. అనంతరం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ ఘర్షణలో రాజకీయాలకు తావులేదని, దీనిపై సమగ్ర విచారణ చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

వైసీపీ నేతల హల్‌చల్

మద్యం మత్తులో రెండువర్గాలు పరస్పరం దాడులకు పాల్పడితే దీన్ని వైసీపీ నేతలు రాజకీయాలకు ఆపాదించారు. స్వయంగా బాధితులు, వారి కుటుంబాలు, ఎస్పీ కూడా ఇందులో ఎలాంటి రాజకీయాలకు తావులేదని చెప్పినా వైసీపీ నాయకులు మాత్రం హంగామా మానలేదు. వైసీపీ నియోజకవర్గ సమన్వయ కార్యకర్త మక్బూల్ తన అనుచరులతో ఆసుపత్రికి చేరుకుని సంఘటనను టీడీపీపైకి నెట్టడంపై పలువురు విమర్శిస్తున్నారు.

మాటల్లో పెట్టి.. మాయ..!

బస్సుల్లో చోరీ చేసే మహిళల ముఠా అరెస్టు

రూ.23 లక్షల విలువైన బంగారం ఆభరణాలు స్వాధీనం



నగలను పరిశీలిస్తున్న ఎస్పీ జగదీష్



అరెస్టు అయిన మహిళలు

అనంతపురం క్రైం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): బస్టాండ్‌లలో తిష్ట వేస్తారు. ఆభరణాలతో ప్రయాణించే మహిళలను గుర్తించి.. వారు ఎక్కే బస్సులో ఎక్కేస్తారు. మాటల్లో పెట్టి.. మాయ చేసేస్తారు. సొమ్మంతా కాజేసి మాయమైపోతారు. చిత్తూరు జిల్లా కుప్పం నియోజకవర్గ కేంద్రానికి చెందిన నలుగురు మహిళలు ఒక ముఠాగా ఏర్పడి.. చోరీలు, దోపిడీలకు తెగబడుతున్నారు. వీరిని రాయదుర్గం రూరల్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.23 లక్షల విలువైన 242.5 గ్రాముల బంగారం ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. జిల్లా పోలీస్ కమ్యూనిటీ హాల్‌లో ఎస్పీ జగదీష్ గురువారం మీడియా సమావేశం నిర్వహించి, ఈ కేసు వివరాలను వెల్లడించారు. చిత్తూరు జిల్లాకు చెందిన సుమతి (46), గీత (37), రంజిత (33), బృంద (27) సమీప బంధువులు, రక్త సంబంధీకులు. ఈ ముఠాలో సుమతి కీలకం. పూసలు, రోల్డ్ గోల్డ్ నగల వ్యాపారం వీరి వృత్తి. కానీ ఈ ముసుగులో చోరీలు, దోపిడీలకు పాల్పడుతున్నారు. గత ఏడాది కణేకల్లు బస్టాండ్‌లో ఓ మహిళ తన బంగారం ఆభరణాలను జాగ్రత్తగా పెట్టుకోవడం చూశారు. ఆమె ఎక్కిన బస్సులోనే ప్రయాణం చేశారు. ఆమెతో మాటలు కలిపి ఏమార్చారు. ఆమె కళ్లుగప్పి బ్యాగ్‌లో ఉన్న 70 గ్రాముల బంగారం లాంగ్ చైన్, 50 గ్రాముల బంగారం నెక్లెస్‌ను తస్కరించి మాయమైపోయారు. ఈ నెల 23వ తేదీ కళ్యాణదుర్గం బస్టాండ్‌లో ఒంటరిగా ఉన్న ఓ ప్రయాణికురాలిపై నిఘా వేశారు. ఆమెను ఎక్కిన బస్సునే ఎక్కారు. ఆమె కణేకల్లు క్రాస్ వద్ద బస్సు దిగబోతుండగా, పథకం ప్రకారం అడ్డుగా నిలిచారు. దీంతో బస్సు స్టాప్ దాటి కొంత దూరం వెళ్లింది. ఎవరూ లేనిచోట ఆగింది. అక్కడ ఆమెతోపాటు ఈ ముఠా దిగింది. బృంద కత్తి తీసుకుని ఆ మహిళను బెదిరించింది. మిగిలినవారు ఆమె వద్ద ఉన్న 107.5 గ్రాముల లాంగ్ చైన్, గాజులు, డాలర్ చైన్, ఉంగరం, కమ్మలను బంగారు ఆభరణాలను లాక్కున్నారు. బాధితురాలి ఫిర్యాదుతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఎస్పీ ఆదేశాలతో రాయదుర్గం రూరల్ సీఐ వెంకటరమణ, కణేకల్లు ఎస్ఐ నాగమధు, బొమ్మనహాళ్ ఎస్ఐ నబీరసూల్ రంగంలోకి దిగారు. కణేకల్లు మండలం యర్రగుంట క్రాస్ వద్ద ఈ ముఠాను అరెస్టు చేశారు. వారి నుంచి రూ.23 లక్షల విలువైన బంగారం ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పోలీసులు రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో కీలకంగా వ్యవహరించిన రాయదుర్గం రూరల్ సీఐ, కణేకల్లు, బొమ్మనహాళ్ ఎస్ఐ, పీఎస్ఐ నారాయణరెడ్డిని ఎస్పీ అభినందించారు.

చీనీకి చవితి ఎఫెక్ట్

మార్కెట్‌కు తగ్గిన దిగుబడులు

అనంతపురంరూరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): చీనీమార్కెట్‌కు వినాయక చవితి పండుగ ఎఫెక్ట్ పడింది. ఈక్రమంలో అనంత వ్యవసాయ మార్కెట్‌కు గురువారం ఉత్పత్తులు తగ్గిపోయాయి. అధికారుల లెక్క ప్రకారం 500 టన్నుల మేర కాయలు నిలిచిపోయాయి. రోజూ మార్కెట్‌కు సీజనల్ కాయలు 500 నుంచి 1200 టన్నుల వరకు వస్తుండేవి. బుధవారం 451, గురువారం 225 టన్నులు మాత్రమే వచ్చాయి. ఈ రెండు రోజులు టన్ను గరిష్ఠంగా 15,500తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణి కార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ.7వేలు, సరాసరి ధర రూ.11,500 పలికాయన్నారు.

ఆంధ్రా క్రికెట్ జట్టుకు గిరినాథ్ రెడ్డి



గిరినాథ్ రెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర క్రికెట్ జట్టుకు జిల్లాకి చెందిన గిరినాథ్ రెడ్డి ఎంపికయ్యాడు. 2వతేదీ నుంచి బెంగుళూరులో నిర్వహించే తిమ్మప్పయ్య ఆలిండియా క్రికెట్ టోర్నీలో ఆంధ్రా జట్టు తరఫున గిరినాథ్ రెడ్డి ప్రాతినిధ్యం వహించనున్నాడు. శుక్రవారం నుంచి మంగళగిరిలో నిర్వహించే శిక్షణ శిబిరంలో గిరినాథ్ రెడ్డి పాల్గొననున్నాడు.

సహకార శాఖలో ఉద్యోగోన్నతి బదిలీలు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా సహకార శాఖలో పలువురికి ఉద్యోగోన్నతి కల్పిస్తూ బదిలీ చేశారు. హిందూపురం ఎస్‌డీఎల్‌సీఓ అసిస్టెంటర్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న వెంకటరామిరెడ్డికి డిప్యూటీ రిజిస్ట్రార్‌గా ప్రమోషన్ ఇస్తూ అనంతపురం డీఎల్‌సీఓగా బదిలీ చేశారు. ఇక్కడ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న ఆదినారాయణకు డిప్యూటీ రిజిస్ట్రార్‌గా ఉద్యోగోన్నతి కల్పిస్తూ హిందూపురానికి బదిలీ చేశారు. రాయదుర్గంలో అసిస్టెంట్ రిజిస్ట్రార్ నాగవీణను డిప్యూటీ రిజిస్ట్రార్‌గా అనంతపురం డీసీఏఓగా నియమించారు. అనంతపురం డీఎల్‌సీఓ కార్యాలయంలో సీనియర్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న సతీష్‌కుమార్‌ను అసిస్టెంట్ రిజిస్ట్రార్‌గా ప్రమోషన్ ఇస్తూ రాయదుర్గం ఎస్‌డీఎల్‌సీఓగా బదిలీ చేశారు.

క్వాంటమ్ టెక్నాలజీతో విప్లవాత్మక మార్పులు: వీసీ

అనంతపురంరూరల్, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): క్వాంటమ్ టెక్నాలజీతో విప్లవాత్మక మార్పులు సాధ్యమని శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయ వీసీ ప్రొఫెసర్ అనిత అన్నారు. వర్సిటీలోని ఇంజనీరింగ్ కళాశాలలో అమరావతి క్వాంటమ్ వ్యాలీ హ్యాకథాన్-2025 సదస్సు గురువారం నిర్వహించారు. కార్యక్రమంలో వీసీ మాట్లాడుతూ.. క్వాంటమ్ టెక్నాలజీ అనేది క్వాంటమ్ మెకానిక్ సూత్రాలను ఉపయోగించి, చిన్న కణాల లక్షణాలను(క్వాంటా) ఉపయోగించుకునే అధునాతన సాంకేతిక రంగం అన్నారు. ప్రస్తుతం ఉన్న క్లాసికల్ టెక్నాలజీలకు మించి, సంక్లిష్ట సమస్యలను పరిష్కరించగల సామర్థ్యాన్ని కలిగి ఉంటుందన్నారు. క్వాంటమ్ కంప్యూటింగ్, కమ్యూనికేషన్, సెన్సార్ వంటి వివిధ రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకురాగలదన్నారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్‌బాబు, రెక్టార్ వెంకటనాయుడు, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర, అటల్ ఇంక్యుబేషన్ సెంటర్ సీఈఓ చంద్రమౌళి, సదస్సు కన్వీనర్లు, అధ్యాపకులు పాల్గొన్నారు.

భూ సేకరణ త్వరగా పూర్తి చేయాలి: జేసీ

అనంతపురం కలెక్టరేట్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): త్వరగా భూ సేకరణ పూర్తి చేయాలని జేసీ శివనారాయణ శర్మ ఆదేశించారు. కలెక్టరేట్‌లో రెవెన్యూ సెక్టార్, వివిధ ప్రాజెక్టులకు భూసేకరణ తదితర అంశాలపై ఆర్డీఓలు, కేఆర్ఆర్‌సీ ఎస్డీసీ, తహసీల్దార్లు, సర్వే ఏడీ, మండల సర్వేయర్ల తో గురువారం ఆయన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. జేసీ మాట్లాడుతూ జిల్లాలో ఎన్‌హెచ్ 544డీ, ఎన్‌హెచ్ 47, 42, 155 తదితర ప్రాజెక్టులకు భూసేకరణ, భూ బదలాయింపునకు సంబంధించి ప్రక్రియలు వేగంగా చేపట్టాలన్నారు. ఇందులో ఎలాంటి ఆలస్యం ఉండరాదన్నారు. రెవెన్యూ సమస్యలను పెండింగ్ లేకుండా పరిష్కరించాలని ఆదేశించారు. అన్నదాత సుఖీభవ కార్యక్రమానికి సంబంధించి భూసమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలన్నారు. ప్రభుత్వం కొత్తగా జారీ చేస్తున్న పట్టాదారు పాసుపుస్తకాలకు సంబంధించి ఏవైనా మార్పులు చేర్పులు ఉంటే వాటిని సరి చేయాలన్నారు.

తల్లీకూతురు అదృశ్యం

కణేకల్లు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని జక్కలవడికి గ్రామానికి చెందిన భారతి (30).. కూతురు జాస్మిక(6)తో కలిసి రెండురోజుల క్రితం అదృశ్యమైనట్లు పోలీసులు తెలిపారు. జక్కలవడికికి చెందిన భారతిని పదేళ్ల క్రితం అదే గ్రామానికి చెందిన వన్నూరుస్వామికి ఇచ్చి వివాహం చేశారు. వీరికి ఇద్దరు సంతానం. వన్నూరుస్వామి తాగుడుకు బానిసవడంతో భారతి కూలి పనులు చేసూకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటుంది. భర్తలో మార్పు రాకపోవడంతో మనస్తాపం చెంది, మంగళవారం సాయంత్రం కుమార్తె జాస్మికతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయింది. నాలుగేళ్ల కుమారుడిని ఇంటి వద్దే వదిలేసి వెళ్లిపోయింది. రెండురోజులైనా భారతి జాడ తెలియకపోవడంతో ఆమె సోదరుడు వన్నూరుస్వామి.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నాగమధు తెలిపారు.

టమోటా కిలో రూ.30

అనంతపురంరూరల్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో కిలో టామోటా గరిష్ఠంగా రూ.30తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూపేకుమార్ తెలిపారు. గురువారం మార్కెట్‌కు 2,250 టన్నుల టమోటా కాయలు వచ్చాయన్నారు. అదే విధంగా టమోటా కిలో కనిష్ఠ ధర రూ.17, సరసరా ధర రూ.24తో విక్రయాలు జరిగాయన్నారు.

న్యూస్ బాక్స్

మత సామరస్యాన్ని చాటిన ముస్లిం చిన్నారులు



వినాయకుడి మండపం ఏర్పాటు చేసిన రిహాన్, షెక్షా, బాషా

అనంతపురం టౌన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): కులం, మతం అన్న భేదం లేదు.. దేవుడు అందరికీ దేవుడే.. వేడుక అందరికీ వేడుకే అంటూ వినాయక చవితి వేడుకను నిర్వహించి మతసామరస్యాన్ని చాటుకున్నారు ముస్లిం విద్యార్థులు. అనంతపురం నగరానికి చెందిన రిహాన్, షెక్షా, బాషా అనే చిన్నారులు నిరుపేదలు. అయితే వీరు వినాయక విగ్రహ ఏర్పాటుకు ఎవరినీ చెందాలు అడగలేదు. తమవద్ద ఉన్న పాకెట్ మనీని ముగ్గురూ జమచేసుకోగా రూ.400 అయింది. ఆ సొమ్ముతోనే తమకు తోచిన మేరకు రామచంద్రనగర్‌లోని టీటీడీ కల్యాణమండపం ముందు చిన్నపాటి గణేష మండపాన్ని తీర్చిదిద్దారు. వినాయకుడి ప్రతిమను తీసుకువచ్చి పూజలు నిర్వహించారు.

గణనాథుడికి ఎమ్మెల్యే పూజలు

రామగిరి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని ఎమ్మెల్యే పరిటాల సునీత బుధవారం వెంకటాపురంలోని తన నివాసంలో ప్రత్యేక పూజలు చేశారు. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, ప్రజలు సుఖసంతోషలతో తులతూగాలని స్వామివారిని మొక్కుకున్నారు.



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

పంచాయతీ కార్యదర్శిపై దాడి అమానుషం



ఫారూఖ్‌ను పరామర్శిస్తున్న ఆల్‌మేవా నాయకులు

అనంతపురం టౌన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): సత్యసాయి జిల్లా పుట్టపర్తి మండలం కోటకమ్మవారిపల్లి పంచాయతీ కార్యదర్శి ఫారూఖ్‌పై దాడి అమానుష చర్య అని ఆల్ మైనార్టీ ఎంప్లాయీస్ వెల్ఫేర్ అసోసియేషన్(ఆల్‌మేవా) నాయకులు ఖండించారు. దాడిలో గాయపడి అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఫారూఖ్‌ను బుధవారం నాయకులు షేక్షావలి, ఫారూక్ మహమ్మద్ పరామర్శించారు. వారు మాట్లాడుతూ విధినిర్వహణలో భాగంగా కోటకమ్మవారిపల్లి గ్రామంలో సచివాలయ సిబ్బంది ఒకరిపై ఒకరు దాడిచేసుకోవడం ప్రభుత్వ ఉద్యోగులుగా సరైంది కాదన్నారు. దాడి చేసిన ఇంజనీరింగ్ అసిస్టెంట్‌పై చర్యలు తీసుకోవాలన్నారు. దౌలా, మహ్మద్ రఫి, సర్దార్, జిలాన్, రసూల్ పాల్గొన్నారు.

వైద్య సిబ్బందిపై దాడి చేసిన వారిని శిక్షించాలి

రాప్తాడు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): కదిరి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో వైద్య సిబ్బందిపై దాడి చేసి గాయపరచిన వారిని కఠినంగా శిక్షించాలని రాప్తాడు వైద్యాధికారి శివకృష్ణ, వైద్య సిబ్బంది డిమాండ్ చేశారు. వైద్య సిబ్బందిపై దాడిని నిరసిస్తూ గురువారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వైద్య సిబ్బంది నిరసన తెలిపారు. ల్యాబ్ టెక్నీషియన్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌బాబు, సూపర్‌వైజర్ నరసింహారావు, సిబ్బంది పాల్గొన్నారు.

వైసీపీ నాయకులపై చర్యలు తీసుకోండి

రామగిరి/చెన్నేకొత్తపల్లి, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): రాప్తాడు మండలానికి చెందిన వైసీపీ నాయకులు ఒక ప్రకటనలో పరిటాల కుటుంబంపై రెచ్చగొట్టే విధంగా వ్యాఖ్యలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పలువురు టీడీపీ నాయకులు డిమాండ్ చేశారు. రాప్తాడు ఎంపీపీ భర్త సత్తిరెడ్డి, మరూరు మాజీ సర్పంచ్ సాకే వెంకటేశ్, రామాంజనేయులుపై చర్యలు తీసుకోవాలని ఏపీ ముత్యాలు, ఫణీంద్ర పలువురు నాయకులతో కలిసి గురువారం సాయంత్రం రామగిరి, సీకేపల్లి పోలీసులకు వేర్వేరుగా ఫిర్యాదు చేశారు.

నీరుగంటి వీధిలో వైద్యశిబిరం

అనంతపురం క్రైం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): నగరంలోని నీరుగంటి వీధిలో 6వ డివిజన్ ఇన్‌చార్జి లావణ్య ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. గురువారం ఫ్రెండ్స్ బ్యాచ్ ఆధ్వర్యంలో ఆదిత్య మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి సహకారంతో శిబిరం నిర్వహించారు. స్థానికులకు వైద్య పరీక్షలు తర్వాత మందులు అందించారు. లావణ్య, టీడీపీ రామకృష్ణ మాట్లాడుతూ యువత మానవత్వంతో సేవా కార్యక్రమాలు చేయడం హర్షణీయమన్నారు. సంజీవరెడ్డి, సాయినాథ్, రవికుమార్, శ్రీనివాసులు, నాగ, యతీష్, బాబు, సుధా, జస్వంత, రఫీ, రుద్ర, చందు, రితేష్, ఇద్రీస్ పాల్గొన్నారు.

'సర్పంచ్‌లూ.. అధైర్యపడకండి'

శింగనమల, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌లు అధైర్యపడవద్దని, వచ్చే నెలలో 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల అవుతాయని పంచాయతీరాజ్ చాంబర్ కార్యనిర్వాహక కార్యదర్శి డేగల కృష్ణమూర్తి ఒక ప్రకటనలో భరోసా ఇచ్చారు. జాతీయ పంచాయతీ రాజ్ చాంబర్ అధ్యక్షుడు వైవీ రాజేంద్ర ప్రసాద్ పలుసార్లు సీఎం చంద్రబాబుకు సమస్యను వివరించినట్లు తెలిపారు.

రీసర్వే వేగవంతం చేయండి: జేసీ

అనంతపురం రూరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): రీసర్వే పనులను వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ శివనారాయణ శర్మ ఆదేశించారు. మండలంలోని మన్నిల గ్రామ సమీపంలో సర్వే పనులను ఆర్డీఓ కేశవనాయుడు, తహసీల్దార్ మోహన్‌కుమార్ తదితరులతో కలసి గురువారం తనిఖీ చేశారు. గ్రామ సరిహద్దు రాళ్లను పరిశీలించారు. గ్రామ సర్వే టీమ్‌లు ప్రతి రోజూ సర్వే పనులకు హాజరు కావాలని, లేదంటే చర్యలు తప్పవన్నారు.

స్థల పరిశీలన: ఉప్పరపల్లి గ్రామంలో ప్రత్యేక రక్షణ దళం కార్యాలయ భవనం కోసం జేసీ స్థలాన్ని పరిశీలించారు. సర్వే నంబరు 19-8లోని 2.50ఎకరాల భూమిని రాష్ట్ర ప్రత్యేక రక్షణ దళం కార్యాలయం, చిన్న శిక్షణ కేంద్రం భవన నిర్మాణాలకు అనువైనదేనా అని పరిశీలించారు. మండల అధికారులతో వివరాలను తెలుసుకున్నారు. మండల సర్వేయర్ రఘు, రీసర్వే డిప్యూటీ తహసీల్దారు పునీత్‌బాబు, ఆర్ఐ సందీప్ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ దివ్యాంగుడి మృతి

గార్లదిన్నె, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సత్యనారాయణరావు (44) అనే దివ్యాంగుడు మృతి చెందాడు. బంధువులు తెలిపిన వివరాల మేరకు విజయనగరం జిల్లాకు చెందిన రాజేశ్వరరావు, సుమిత్రమ్మ దంపతులు రెండేళ్లక్రితం క్రితం గార్లదిన్నెకు వచ్చారు. గార్లదిన్నె ఇందిరమ్మ కాలనీలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. వారి కుమారుడు పుట్టుకతోనే దివ్యాంగుడు కావడంతో పెళ్లి కాలేదు. ఈ విషయమై తరచూ బాధపడుతుండేవాడు. తీవ్ర మనస్థాపానికి గురైన సత్యనారాయణరావు 20న విషపు గుళికలు మింగి అపస్మారక స్థితిలో పడిపోయాడు. గమనించిన కుటుంబ సభ్యులు అనంతపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.అక్కడ చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేపట్టారు.

నెరవేరిన దశాబ్దాల కల..!

- ఎమ్మెల్యే చొరవతో లింగనపల్లి విద్యుత్ సమస్య పరిష్కారం
- హర్షం వ్యక్తంచేస్తున్న గ్రామస్థులు

రాప్తాడు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): లింగనపల్లి గ్రామ ప్రజల దశాబ్దాల సమస్య పరిష్కారమయ్యింది. ప్రజలు విద్యుత్ సమస్యతో సతమయ్యేవారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుంతోనని బిక్కుబిక్కు మంటూ కాలం వెళ్లదీసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదికే దీర్ఘకాలిక సమస్య పరిష్కారం కావడంతో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని బొమ్మేపర్తి పంచాయతీ లింగనపల్లి గ్రామంలో ఇళ్లపైన 11 కేవీ విద్యుత్ తీగలను పొలాలకు సరఫరా చేశారు. ఇళ్లపైన తీగలు ఉండటంతో ప్రజలు భయాందోళన చెందేవారు. కొంతమంది ప్రమాదాల బారిన పడి గాయపడిన సంఘటనలు ఉన్నాయి. ఇళ్లపైన ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ తీగలను మార్చాలని గ్రామస్థులు పలుమార్లు విన్నవించినా ఏ అధికారి, రాజకీయ నాయకులు పట్టించుకోలేదు. 2024 ఎన్నికల ప్రచార సమయంలో పరిటాల సునీత, మండల ఇన్‌చార్జి ధర్మవరపు మురళి లింగనపల్లి గ్రామానికి వచ్చినపుడు సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోరారు. అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు ఎమ్మెల్యే పరిటాల సునీత విద్యుత్ శాఖ అధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఇళ్లపై ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలను తొలగించి పొలాల్లో అమర్చారు. దీర్ఘకాలిక సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



పొలాల్లో విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేస్తున్న అధికారులు (ఫైల్)

ఎమ్మెల్యే చొరవతోనే సమస్య పరిష్కారం



గ్రామంలో ఇళ్లపైన 11 కేవీ విద్యుత్ తీగలు ప్రమాదకరంగా ఉండటంతో గ్రామస్థులు నిత్యం భయాందోళన చెందేవారు. విద్యుత్ ప్రమాదాలతో కొంత మంది గాయపడ్డారు. ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేక చొరవతోనే సమస్య పరిష్కారమైంది.

-సూర్యనారాయణరెడ్డి, లింగనపల్లి

మా ఇంటిపై విద్యుత్ తీగలు ఉండేవి



మా ఇంటిపై 11 కేవీ విద్యుత్ తీగలు ఏళ్ల నుంచి ఉండేవి. ఇంటిపైకి వెళ్లాలంటే భయం భయంగా ఉండేది. వానా కాలం గాలికాలం ఏ ప్రమాదం జరుగుతుందో అని భయభ్రాంతులకు గురయ్యేవారం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే సమస్య పరిష్కారమైంది.

-అశోక్‌రెడ్డి, లింగనపల్లి

విద్యుత్ భారాలపై మరో ఉద్యమం

- వామపక్ష నాయకుల హెచ్చరిక



టవర్‌క్లాక్ వద్ద ప్రతిజ్ఞ చేస్తున్న వామపక్ష నాయకులు

అనంతపురం విద్య ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్‌రంగంలో ప్రభుత్వాల నిర్ణయాలకు విరుద్ధంగా ఉమ్మడిరాష్ట్రంలో చేపట్టిన ఉద్యమంలో అమరులైన వీరుల స్ఫూర్తితో మరో ఉద్యమం చేపట్టడానికి సిద్ధమవుతున్నట్లు వామపక్షనేతలు అన్నారు. విద్యుత్ ఉద్యమంలో హైదరాబాద్‌లో జరిగిన కాల్పులలో మరణించిన అమరులకు గురువారం సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో నివాళులు అర్పిస్తూ ప్రతిజ్ఞ చేశారు. సీపీఐ జిల్లా కార్యదర్శి నారాయణస్వామి, సీపీఎం జిల్లా కార్యదర్శి నాగేంద్రకుమార్, సీపీఐ నగర కార్యదర్శి శ్రీరాములు, సీపీఎం నగర కార్యదర్శి రామిరెడ్డి మాట్లాడుతూ 25 సంవత్సరాల క్రితం విద్యుత్ రంగంలో ప్రజావ్యతిరేక నిర్ణయాలను నిరసిస్తూ చేపట్టిన వామపక్షాల ఉద్యమంలో అప్పటిసర్కారు కాల్పులు జరపగా ముగ్గురు ప్రాణాలు కోల్పోయారన్నారు. అసువులుబాసిన వారి ఆత్మకు శాంతికలగాలనే ఈరోజు నిరసన,నివాళులు అర్పించి భవిష్యత్‌ఉద్యమంపై ప్రతిజ్ఞ చేశామన్నారు. సీపీఐ, సీపీఎం వామపక్షాల నేతలు నాగరాజు, చంద్రశేఖర్, మల్లికార్జున, రాజారెడ్డి, పద్మావతి, లింగమయ్య, రమణ, కుళ్లాయిస్వామి, రాజేష్, కృష్ణుడు పాల్గొన్నారు.

నార్పల, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కూరగాయలపల్లి గ్రామంలో గురువారం పెంచిన విద్యుత్ చార్జీలకు వ్యతిరేకంగా సీపీఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మండల కార్యదర్శి గంగాధర్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం కొనసాగిస్తున్న మోదీ, అదానీ అనుకూల విద్యుత్ సంస్కరణలు, పెంచిన విద్యుత్ చార్జీలు, ట్రూఅప్ చార్జీలు, స్మార్ట్ మీటర్లు తదితర విధానాలపై పోరాడుతామన్నారు. అనంతరం నాయకులు ప్రతిజ్ఞ చేశారు. మండల సహాయ కార్యదర్శి చేపల రామాంజి, వ్యవసాయ కార్మిక మండల కార్యదర్శి పెద్దపెద్దయ్య, నారాయణప్ప, శీనా, నారాయణ, గోపాలకృష్ణయ్య పాల్గొన్నారు.



నార్పలలో ప్రతిజ్ఞ చేస్తున్న సీపీఐ నాయకులు

గ్రంథాలయం తనిఖీ

రామగిరి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రంథాలయాన్ని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి రమ గురువారం తనిఖీ చేశారు. గ్రంథాలయంలోని రికార్డులను పరిశీలించారు. గ్రంథాలయ సెస్ బకాయిల వసూళ్లకు కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని వాటిని విద్యార్థులు, నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. టీడీపీ నాయకుడు రంగయ్య, అక్కులప్ప, ఆంజనేయులు, సుబ్బరాయుడు, విశ్వనాథ్, గ్రంథాలయ అధికారి సీవీ రమణ, రామాంజనేయులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయండి

కనగానపల్లి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): దివంగత పరిటాల రవీంద్ర జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య, మార్కెట్ యార్డ్ చైర్మన్ సుధాకర్ చౌదరి పిలుపునిచ్చారు. స్థానిక పరిటాల భవన్‌లో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. పరిటాల రవీంద్ర జయంతి సందర్భంగా రామగిరిలో శుక్రవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారన్నారు. మండల వ్యాప్తంగా ఉన్న ఆయన అభిమానులు అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేయాలన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు బిల్లే దాము, రాజాక్రిష్ణ, ఆంజనేయులు, నరసప్ప, పురుషోత్తం, రాము, ముత్యాలు పాల్గొన్నారు.

ఆత్మకూరు: రామగిరిలో శుక్రవారం జరిగే పరిటాల రవీంద్ర, ఎన్టీఆర్ రామావు కాంస్య విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ మండల కన్వీనర్ శ్రీనివాసులు పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని రక్తదానం చేయాలని కోరారు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

అనంతపురం క్రైం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): బాధిత కుటుంబానికి వడ్డెర సంఘం నాయకులు అండగా నిలిచారు. రాజీవ్ కాలనీలో నివాసం ఉండే వడే రమణ గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న టీఎన్‌టీయూసీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి, వడ్డెర సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కుంచపు వెంకటేశులు, సిమెంట్ పోలన్న, రంగయ్య వెళ్లి రూ.10 వేలు ఆర్థికసాయం అందించారు. వెంకటేశులు మాట్లాడుతూ వినాయకచవితి పండుగ రోజు ఇలాంటి విషాదకర సంఘటన జరగడం బాధాకరమన్నారు. రమణ కుటుంబానికి అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

ఏకగ్రీవమేనా..?

- ఏఎంసీ స్టాండింగ్ కమిటీకి ఐదు నామినేషన్లు

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): అనంత నగరపాలక సంస్థలో స్టాండింగ్ కమిటీ సభ్యుల కోసం ఐదు నామినేషన్లు వేశారు. కమిషనర్ బాలస్వామి, సెక్రటరీ రంగస్వామి ఇచ్చిన ఎన్నికల నోటిఫికేషన్ మేరకు 22 నుంచి 28వతేదీ వరకు ఆయా కార్పొరేటర్ల నుంచి అధికారులు నామినేషన్లు స్వీకరించారు. నామినేషన్ల పత్రాలను ప్రదర్శించిన అధికారులు గురువారం వాటిని పరిశీలించారు. ఐదుగురు ఉన్న స్టాండింగ్ కమిటీకి ఐదుగురే నామినేషన్లు వేశారు. ఐదుగురిలో మల్లికార్జున 15వ డివిజన్, కె జయలత 5వ డివిజన్, బి లావణ్య 20వ డివిజన్, ఎం.దేవి 9వ డివిజన్, పి.రామాంజినమ్మ 11వ డివిజన్ కార్పొరేటర్లు ఉన్నారు. కమిటీలోని ఐదుగురు సభ్యుల కోసం అభ్యర్థులు ఐదుగురే ఉండడంతో ఏకగ్రీవం చేయనున్నారా అనేది స్పష్టత రావడం లేదు. ఒక వేళ ఎన్నికలు జరిగితే షెడ్యూల్ ప్రకారం సెప్టెంబరు 1న నామినేషన్ల ఉపసంహరణకు చివరి గడువు. అదేరోజు సాయంత్రం 3గంటలకు పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితా ప్రకటించనున్నారు. సెప్టెంబరు 5న ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు ఏఎంసీలోని న్యూ కాన్ఫెరెన్స్‌హాల్‌లో పోలింగ్ నిర్వహించనున్నారు. అదే రోజు 3 గంటలకు ఓట్ల లెక్కింపు, ఫలితాల ప్రకటించనున్నారు. జీఓ నంబరు 49 ప్రకారం అనంత నగరపాలక సంస్థలో 50 మంది కార్పొరేటర్లు, ఐదుగురు స్టాండింగ్ కమిటీ సభ్యులను ఎన్నుకోనున్నారు. ఏడాది పాటు స్టాండింగ్ కమిటీ సభ్యుల పదవీకాలం ఉంటుంది.

బోడమల్లయ్య స్వామికి ప్రత్యేక పూజలు

రాప్తాడు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని హంపాపురం సమీపంలో వెలసిన బోడమల్లయ్యస్వామికి గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఏటా వినాయక చవితి మరునటి రోజు స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. అందులో భాగంగా గురువారం చుట్టు పక్కల గ్రామాల నుంచి స్వామి వారి కాపులు అధిక సంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. ఆలయం వద్ద ఉపవాస దీక్ష విరమించారు.

'అర్హులకు పింఛన్లు అందించడం టీడీపీకే సాధ్యం'

శింగనమల, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికి పింఛన్లు అందించడం టీడీపీ పాలనలో సాధ్యమని ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ ఒక ప్రకటనలో అన్నారు. ప్రజల హక్కుగా పేదలకు పింఛన్ వ్యవస్థను రూపొందించిన ఘనత టీడీపీకే దక్కుతుందన్నారు. వైసీపీ తప్పుడు ప్రచారాలతో రాష్ట్రంలో పింఛన్లు తొలగించారనడం వారి విజ్ఞతకే వదిలేస్తున్నామన్నారు. సీఎం చంద్రబాబు అర్హత ఉన్న ఒక్క పింఛన్‌ను కూడా తొలగించరన్నారు. వైసీపీకి పింఛన్లపై మాట్లాడే నైతిక హక్కులేదన్నారు.

జాతీయ సదస్సుకు హాజరైన ఏపీడీ

అనంతపురం అర్బన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): వాటర్ షెడ్‌లో ఆధునిక టెక్నాలజీని వాడటంపై ఢిల్లీలోని ఎన్ఏఎస్సీ కాంప్లెక్స్‌లో గురువారం జాతీయ సదస్సు ప్రారంభమైంది. రెండు రోజులపాటు జరిగే ఈ సదస్సుకు ఏపీ నుంచి అనంత డ్వామా వాటర్ షెడ్ ఏపీడీ సుధాకర్‌రెడ్డి హాజరయ్యారు. వాటర్ షెడ్ అభివృద్ధిలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడంపై సదస్సులో చర్చించారు.

అడ్డుగా మారిన డివైడర్..!

ప్రమాదకరంగా జేఎన్‌టీయూ రహదారి

అనంతపురం క్లాక్‌టవర్, ఆగస్టు 28 (ఆంధ్రజ్యోతి): డివైడర్లను రోడ్డుకు అడ్డంగా మార్చడంతో ప్రమాదాలకు అడ్డాగా మారింది. కలెక్టరేట్ నుంచి జేఎన్‌టీయూ, హౌసింగ్‌బోర్డు, శారదానగర్‌వైపు వెళ్లే ప్రధాన రహదారిలో డివైడర్లు ఏర్పాటు చేశారు. అయి తే కొందరు రోడ్డుకు సమానంగా ఉన్న డివైడర్లను అడ్డంగా తిప్పేశారు. దీంతో వాహనదారులు అడ్డంగా తిప్పిన డివైడర్లను ఢీకొని ప్రమాదాలకు గురవుతున్నారు. నగరపాలక సంస్థ, పోలీసులు అనుమతి లేకుండా డివైడర్లను ఎలా అడ్డంగా మార్చారని పలువురు బాధితులు ప్రశ్నిస్తున్నారు. డివైడర్లను అడ్డంగా మార్చడంతో పందులు, ఆవులు, కుక్కలు ఆ వీధుల్లో దూరి వాహనాల కిందికి వచ్చేస్తున్నాయి. దీనిపై ఇప్పటికే నగరపాలక సంస్థ అధికారులకు పలువురు ఫిర్యాదు చేశారు. అయితే అధికారులు స్పందించడం లేదని వాపోతున్నారు. వెంటనే అడ్డంగా మార్చిన డివైడర్లను సక్రమంగా మార్చాలని వాహనదారులు కోరుతున్నారు.



కలెక్టరేట్ నుంచి జేఎన్‌టీయూకి వెళ్లే ప్రధాన రహదారి, ప్రమాదకరంగా డివైడర్

పార్వతీ తనయా.. పాహిమాం..

- వాడవాడలా వెలసిన గణనాథులు
- ఘనంగా వినాయక చతుర్థి వేడుకలు

పార్వతీ తనయుడు తొలిపూజలు అందుకున్నాడు. పల్లెలు, పట్టణాలు తేడా లేకుండా వీధి వీధినా బొజ్జగణపయ్య కొలువై భక్తకోటికి కనువిందు చేశాడు. వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం జిల్లా వ్యాప్తంగా ప్రజలు వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. చాలా ప్రాంతాల్లో ఈఏడాది ప్రత్యేకించి ఆపరేషన్ సిందూర్ ఘట్టాలను ప్రదర్శించగా మిగిలిన ప్రాంతాల్లో పర్యావరణ ప్రాశస్త్యాన్ని తెలియజేస్తూ ఎకో ఫ్రెండ్లీ వినాయకులను కొలువుదీర్చారు. ఇలా జిల్లావ్యాప్తంగా వాడవాడలా వెలసిన వినాయక మండపాలన్నింటిలోనూ ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించగా... చిన్న, పెద్ద తేడాలేకుండా అందరూ గణనాథుని మండపాలకు చేరుకుని, వివిధ రూపాల్లో కొలువైన స్వామివారిని దర్శించుకున్నారు. రెవెన్యూ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని కృష్ణకళామందిర్‌లో ఏర్పాటు చేసిన వినాయకుడి ఉత్సవాల్లో కలెక్టర్ వినోద్‌కుమార్ దంపతులు పాల్గొని విఘ్నేశ్వరుడికి తొలి పూజలు నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జేసీ శివ్ నారాయణ్ శర్మ, అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహార్, డీఆర్‌ఓ మలోల దంపతులు, ఎఫ్ఎస్ఓ రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



రామచంద్రనగర్‌లో అభ్యుదయ గణేష ఉత్సవ సమితి ఆధ్వర్యంలో కొలువుదీరిన గణపతి



ఆర్డీటీ కార్యాలయం ఎదుట పేపర్‌తో తయారు చేసిన ఎకో ఫ్రెండ్లీ వినాయకుడు



ఓబుళదేవరనగర్‌లో ఛత్రపతి శివాజీ మిత్రబృందం ఏర్పాటు చేసిన వినాయకుడు



నాలుగో రోడ్డు ఛత్రపతి శివాజీ స్కూల్ వద్ద నెమలి ఈకల వినాయకుడు



పాతూరు బ్రాహ్మణ కాలనీలో కన్నప్ప వేషంలో వినాయకుడి దర్శనం



వినాయక్‌నగర్‌లో...



పూజల్లో పాల్గొన్న కలెక్టర్ దంపతులు, అధికారులు



యువజన కాలనీలో..



పాపంపేటలో శ్రీగణేష్ యూత్ ఆధ్వర్యంలో...



బీకేఎస్‌లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న రామలింగారెడ్డి, రవికాంత్, రమణ





చిన్మయానగర్‌లో ఆపరేషన్ సిందూర్ సైనికుడి ఆకారంలో వినాయకుడు

వీధివీధినా వినాయకుడు

సంప్రదాయ విగ్రహాల వైపే మొగ్గు.. ఉత్సాహంగా వినాయక చవితి

ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్: పట్టణాలు... పల్లెలు... అనే తేడా లేకుండా వీధివీధినా వినాయక విగ్రహాలను ఏర్పాటు చేశారు. ఈ సారి ఉత్సవాల నిర్వాహకులు, యువకులు సంప్రదాయ, మట్టి విగ్రహాలను ఏర్పాటు చేయడంపై మొగ్గు చూపడం విశేషం. పట్టణాల్లో భారీ సెట్టింగుల మధ్య స్వామి వారిని ఏర్పాటు చేశారు. బుధ, గురువారాల్లో వేలాది మంది భక్తులు వివిధ రూపాల్లో కొలువైన స్వామివారిని దర్శించుకున్నారు.


గుత్తి ఆర్ఎస్‌లో రైల్వే బుకింగ్ కార్యాలయం వద్ద రైల్వే కార్మికులు 1,661 టెంకాయలతో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం


పామిడి వీరభద్రస్వామి దేవాలయంలో మామిడి కాయలు కోస్తున్న రైతు ఆకారంలో వినాయకుడు


బెళుగుప్పలో అనంత పద్మనాభుడిగా..


పుట్లూరు మండలం తక్కళ్లపల్లిలో హంస వాహనంపై..


ఉరవకొండలో ముత్యాలతో తయారు చేసిన విగ్రహం



పామిడి తగ్గుదేవాలయంలో వెన్నదొంగ కృష్ణుడిగా..


కళ్యాణదుర్గంలో ఎమ్మెల్యే అమిలినేని పూజలు


గుంతకల్లులో వరసిద్ధి వినాయక కాలనీలో ముగ్గుల పోటీలో విజేతలకు చీరలను పంపిణీ చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి గుమ్మనూరు నారాయణస్వామి


కూడేరులో అయ్యప్పస్వామి రూపంలో గణనాథుడు


గుంతకల్లులో కమ్మసేవా సంఘం ఆధ్వర్యంలో..


బెళుగుప్ప మండలం ఎర్రగుడిలో శివుడి రూపంలో..


వజ్రకరూరులో బుద్ధుడి ఆకారంలో వినాయకుడు


పెద్దవడుగూరులో..


యల్లనూరు మండలం కృష్ణాపురంలో నిమజ్జనానికి తరలి వెళ్తూ..


యాడికిలో నిమజ్జనానికి..


నేమకల్లులో వినాయకుడికి పూజలు చేస్తున్న భక్తులు

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

గుత్తిరూరల్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని మార్నేంపల్లి గ్రామశివారులోని 67వ జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. తాడిపత్రికి చెందిన దంపతులు రాఘవేంద్ర, అశ్విని కూతురు కుందనతో కలసి గుంతకల్లుకు వచ్చారు. తిరిగి స్వగ్రామానికి బైక్‌పై వెళ్తుండగా మార్నేంపల్లి వద్ద బైక్ అదుపుతప్పి బోల్తా పడడంతో ఆ ముగ్గురూ గాయపడ్డారు. స్థానికులు వారిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

రెండు లారీలు ఢీ...

గుత్తి మండలంలోని బాచుపల్లి గ్రామాశివారులోని 44వ జాతీయ రహదారిపై బుధవారం తెల్లవారుజాము జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. బాటసుంకులమ్మ దేవాలయం సమీపంలో రెండు లారీలు ఢీకొనడంతో ఉత్తరప్రదేశ్‌కి చెందిన లారీ డ్రైవర్ అజయ్, తమిళనాడుకు చెందిన లారీ డ్రైవర్ మురేగేష్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు వారిని గుత్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం ఇద్దరిని అనంతపురానికి తరలించారు. కేసు దర్యాప్తులో ఉంది.

● బొమ్మనహాళ్ : బొమ్మనహాళ్ సమీపంలోని కర్ణాటక సరిహద్దులో నేమకల్లు క్రాస్ వద్ద బుధవారం కారు, ద్విచక్రవాహనం ఢీకొని ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. బళ్లారి నుంచి ద్విచక్రవాహనంలో ఓ వ్యక్తి, ఇద్దరు మహిళలు బొమ్మనహాళ్ వైపు వస్తుండగా ... బళ్లారి వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ప్రమాదంలో బైక్‌పై వెళ్తున్న ముగ్గురూ గాయపడ్డారు. స్థానికులు వారిని బళ్లారి విమ్స్‌కు తరలించారు. బళ్లారి రూరల్ పోలీసులు కేసు విచారణ చేస్తున్నారు.

టిప్పర్ బోల్తా

తాడిపత్రి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇగుడూరు సమీపంలో బుధవారం తెల్లవారుజామున అదుపుతప్పి కల్వర్ట్‌లోకి టిప్పర్ బోల్తాకొట్టింది. ఈ ప్రమాదంలో ఎవరూ గాయపడలేదు. డ్రైవర్ చిన్నచిన్నగాయాలతో బయటపడ్డారు.

ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి వైర్ చోరీ

బెళుగుప్ప, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసాపురం గ్రామ శివార్లలోని దొడఘట్ట కిష్టప్పకు చెందిన వ్యవసాయ తోటలోని ట్రాన్స్‌ఫార్మర్‌ను బుధవారం రాత్రి దుండగులు ధ్వంసం చేసి.. అందులోని రాగి వైర్‌ను చోరీ చేశారు. దీనిపై బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

జూదరుల అరెస్ట్

పెద్దవడుగూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని తెలికి గ్రామంలోని ఓ ఇంటిలో పేకాట ఆడుతున్న ఎనిమిది మందిని గురువారం అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ ఆంజనేయులు తెలిపారు. వారి వద్ద ఉన్న రూ.34,300ను స్వాధీనం చేసుకొని.. కేసు నమోదు చేశామని చెప్పారు.

ఆధ్యాత్మిక వచనాలు


పూజలు నిర్వహిస్తున్న ఉత్తరాధికారి

ఉరవకొండ, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక గవిమఠంలో మొదటి పీఠాధిపతి కరిబసవరాజేంద్రస్వామి చరిత్ర, ఆధ్యాత్మిక, పురాణ వచనాలను ఉత్తరాధికారి కరిబసవరాజేంద్ర స్వామి గురువారం నిర్వహించారు. కరిబసవరాజేంద్రస్వామి గద్దెకు రుద్రాభిషేకం, ప్రత్యేక పూజలను నిర్వహించారు.

పురాతన పిల్లిగుండ్లు ధ్వంసం

కుందుర్పి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక పాత ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ఉన్న పురాతన పిల్లిగుండ్లను అదే గ్రామానికి చెందిన ఓ వ్యక్తి యంత్రాలతో గురువారం ధ్వంసం చేశాడు. పిలిగుండ్లపై ప్రాచీన దేవతామూర్తుల విగ్రహాలు ఉన్నాయి. తన ఇంటి వద్ద ఉన్న ఈ పిల్లిగుండ్లతో ప్రమాదం పొంచి ఉందని భావించి.. యంత్రాలతో ధ్వంసం చేస్తుండగా స్థానికులు తహసీల్దార్‌కు సమాచారం అందించారు. తహసీల్దార్ ఓబుళేషు ప్రస్తుతానికి ఆ పనులను ఆపివేయించారు.

విద్యార్థికి ప్రథమ బహుమతి



గుత్తి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): పొగాకు వాడకంతో అనర్థాలపై ప్రజలలో అవగాహన కల్పించడంలో స్థానిక కోటవీధిలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 8వ తరగతి విద్యార్థి యశ్వంత్ మండల స్థాయిలో ప్రథమ బహుమతి సాధించాడు. దీంతో ప్రభుత్వం ఆ విద్యార్థికి పంపిన సర్టిఫికేట్, ట్రావేల్ బ్యాగ్‌ను ఆ పాఠశాల హెచ్ఎం సుభాన్ గురువారం యశ్వంత్‌కు అందజేశారు.

'గొర్రెల షెడ్లను తొలగించండి'


గొర్రెల షెడ్డును పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి

విడపనకల్లు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కరకముక్కలలో ఇళ్ల మధ్యలో రెండు గొర్రెల షెడ్లను ఏర్పాటు చేశారని, వాటి నుంచి వచ్చే దుర్వాసనతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆ గ్రామస్థులు కే గాదిలింగ, కాశీ, నాగరాజు తదితరులు గురువారం వాపోయారు. ఆ షెడ్లల్లో దాదాపు 1000 గొర్రెలు ఉన్నాయని, వాటి పెంటను కూడా అక్కడే దిబ్బలా వేశారని, వాటి నుంచి వచ్చే దర్వాసనను భరించలేక పోతున్నామని అన్నారు. ఇటీవల వర్షాలు అధికంగా వస్తుండటంతో దుర్వాసన మరింత అధికమైందన్నారు. దీంతో చుట్టుపక్కల ప్రాంతాల వారు రోగాల బారిన పడుతున్నారన్నారు. దీనిపై సోమవారం స్థానిక సచివాలయంలో సోమవారం ఫిర్యాదు చేశామని, స్పందించిన గ్రామ కార్యదర్శి లోకేష్ గొర్రెల షెడ్లను పరిశీలించారని, ఉన్నతాధికారులతో చర్చించి వాటిని తొలగించేలా చర్యలు తీసుకుంటామని చెప్పారన్నారు. అధికారులు స్పందించి.. ఇళ్ల మధ్యలో ఏర్పాటు చేసిన గొర్రెల షెడ్లను తొలగించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.


డ్యాన్స్ పోటీలకు హాజరైన మణికంఠ, పవన్‌కుమార్ గౌడ్

ఉత్సాహంగా డ్యాన్స్ పోటీలు

గుంతకల్లు టౌన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక రామస్వామి వీధిలో ఫ్రెండ్స్ టూ హెల్ప్ ఆధ్వర్యంలో 25 సంవత్సరాలుగా వినాయక విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం నిర్వహించిన డ్యాన్స్ పోటీల్లో 250 మంది పాల్గొన్నారు. పోటీల్లో విజేతలకు 2018 డీ చాంపియన్ మణికంఠ, టీడీపీ కౌన్సిలర్ ఆర్‌పవన్‌కుమార్ గౌడ్ చేతుల మీదుగా బహుమతులను అందజేశారు. ఇందులో నిర్వాహకులు ఆర్ రామ్‌తేజ్ గౌడ్, బీకే మధు, అవినాష్, వెంకటేష్, గురు, పోలాపవన్, సుదీర్, శ్యామ్, ప్రసాద్ పాల్గొన్నారు.

రిజర్వాయర్‌కు 2,080 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో

బెళుగుప్ప, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 2,080 క్యూసెక్కులు, ఔట్‌ఫ్లో 2040 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు గురువారం తెలిపారు. రిజర్వాయర్‌లో 1.716 టీఎంసీల నీరు ఉందని, ఫేజ్-2కు 1,640 క్యూసెక్కుల నీరు వెళ్తోందని వెల్లడించారు.

క్రీడాసామగ్రి అందజేత

బెళుగుప్ప, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోణంపల్లి ప్రాథమికోన్నత పాఠశాల పూర్వ విద్యార్థి స్వరూప ప్రస్తుతం హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నారు. తాను చదువుకొన్ని పాఠశాలకు రూ.ఆరు వేలు విలువ చేసే క్రీడా సామగ్రిని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసనాయక్‌కు గురువారం అందజేశారు.

పోలీస్‌స్టేషన్ తనిఖీ

పుట్లూరు, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీస్‌స్టేషన్‌ను అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు గురువారం తనిఖీ చేశారు. వారం క్రితం పుట్లూరులో జరిగిన దొంగతనం కేసులో పురోగతిపై ఆరాతీశారు. నిమజ్జనం చేసే చోట పోలీసు బందోబస్తు ఏర్పాటు చేయాలని తెలిపారు.

5న ఫర్నీచర్ వేలం

కణేకల్లు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక కమ్యూనిటీ సెంటర్‌లో ఉన్న పాత ఫర్నీచర్‌ను వచ్చే నెల 5న వేలం వేస్తున్నట్లు వైద్యుడు షరీఫ్ గురువారం తెలిపారు. వివరాలకు ప్రభుత్వాసుపత్రిని సంప్రదించాలని కోరారు.

నేడు విద్యుత్ సరఫరా బంద్

యల్లనూరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలో విద్యుత్ సరఫరాను శుక్రవారం మధ్యాహ్నం 11:30 గంటల నుంచి సాయంత్రం 5:30గంటల వరకు నిలిపేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ పద్మనాభరెడ్డి తెలిపారు. నిమజ్జనం కారణంగా ముందస్తు జాగ్రత్తగా సరఫరాను బంద్ చేస్తున్నామన్నారు.

విద్యుత్ ఉద్యమ అమరులకు నివాళి

కూడేరు, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లో బషీర్ బాగ్ వద్ద 25 సంవత్సరాల క్రితం జరిగిన విద్యుత్ ఉద్యమంలో అమరులైన వారికి స్థానిక సీపీఎం కార్యాలయంలో గురువారం నివాళులర్పించారు. స్మార్ట్‌మీటర్లు రద్దు చేయాలని, విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యులు కృష్ణమూర్తి, మండల నాయకులు వెంకటేష్, రాధాకృష్ణ, పెద్దన్న, మల్లికార్జున పాల్గొన్నారు.

● గుంతకల్లుటౌన్: స్థానిక విద్యుత్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. విద్యుత్ ఉద్యమ అమరులకు నివాళులర్పించారు. విద్యుత్ చార్జీలు తగ్గించాలని ఏడీఈకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బీ శ్రీనివాసులు, పట్టణ కార్యదర్శి మారుతిప్రసాద్ పాల్గొన్నారు.

● ఉరవకొండ: విద్యుత్ పోరాటంలో అమరులైన కార్యకర్తలకు వామపక్ష పార్టీ నాయకులు నివాళులర్పించారు. ప్రభుత్వం సర్దుబాటు చార్జీల పేరుతో అదనపు వసూళ్లను నిలిపివేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమాలలో సీపీఎం నాయకులు రంగారెడ్డి, రైతు సంఘం నాయకులు వెంకటేష్ పాల్గొన్నారు.

● గుత్తి: విద్యుత్ చార్జీలు తగ్గింపు కోసం నిర్వహించిన ఉద్యమంలో అసువులు బాసిన అమరవీరులకు గురువారం సీపీఎం ఆధ్వర్యంలో గాంధీ సర్కిల్‌లో నివాళులర్పించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి నిర్మల, నాయకులు రామకృష్ణ, మల్లికార్జున, అశోక్, చందు, ప్రశాంత్ పాల్గొన్నారు.

ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

గుంతకల్లుటౌన్, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని బుగ్గసంగాలలో బుగ్గసంగమేశ్వర స్వామి దేవస్థానంలో గురువారం నూతన ధర్మకర్తల మండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ధర్మకర్తల మండల చైర్మన్‌గా ఎస్ ఈశ్వరయ్య, సభ్యులుగా లాలిరెడ్డిడ, సబ్బన్న, గంగమ్మ, ప్రకాశ్‌రావు, అరుణ సునీతబాయి, ఎం శ్రీనివాసులు, అర్చకుడిగా మంజునాథ ప్రమాణ స్వీకారం చేశారు. ఇందులో ఆలయ ఈఓ కృష్ణయ్య, టీడీపీ మండల ఇన్చార్జి గుమ్మనూరు నారాయణస్వామి, టీడీపీ మండల అధ్యక్షుడు రామన్నచౌదరి, సింగిల్‌విండో చైర్మన్ తలారి మస్తానప్ప, నాయకులు పత్తిహిమబిందు, గుమ్మనూరు వెంకటేష్, జడ్పీటీసీ కదిరప్ప పాల్గొన్నారు.


బెళుగుప్పలో కురుస్తున్న వాన

మండలంలో మోస్తరు వర్షం

బెళుగుప్ప, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): మండలంలో గురువారం సాయంత్రం ఓ మోస్తరు వర్షం కురిసింది. తుఫాను ప్రభావంతో కురుస్తున్న ఈ వర్షాలతో రైతులు ఆందోళన చెందుతున్నారు. కంది పంటలో గడ్డి మొక్కలు తొలగించడానికి సమ యం దొరకడం లేదని, నల్లరేగడి నేలల్లో విపరీ తంగా గడ్డి ఏపుగా పెరిగిందని రైతులు వాపోతున్నారు.

ఆధార్ అప్‌డేట్ కోసం అవస్థలు

యాడికి, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక సచివాలయంలో పై అంతస్తులో ఆధార్ అప్‌డేట్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దీంతో ఆధార్ అప్‌డేట్ చేసుకోవడానికి వచ్చిన దివ్యాంగులు పై అంతస్తులోకి వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని కమలపాడు గ్రామానికి చెందిన దివ్యాంగుడు మహేష్ ఆధార్‌లో బయోమెట్రిక్ అప్‌డేట్ కోసం గురువారం కమలపాడు గ్రామం నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలో ఉన్న యాడికిలోని సచివాలయం-2కు


దివ్యాంగుడు మహేష్

మూడు చక్రాల సైకిల్‌లో వచ్చాడు. తీరా ఇక్కడకు వచ్చాక చూస్తే ఆధార్ కేంద్రం పై అంతస్తులో ఏర్పాటు చేసినట్లు సచివాలయ సిబ్బంది తెలిపారు. ఏ మాత్రం మెట్లపైకి ఎక్కలేని మహేష్ తమలాంటి వారి పరిస్థితి ఏమిటని ఎంపీడీఓ కార్యాలయానికి వెళ్లాడు. ఎంపీడీఓ అక్కడే లేకపోవడంతో కమలపాడుకు తిరిగి వెళ్లాడు. ఈ విషయాన్ని ఎంపీడీఓ వీరరాజు దృష్టికి తీసుకువెళ్లగా... 'సచివాలయ సిబ్బందితో మాట్లాడతాం. దివ్యాంగుల ఆధార్ అప్‌డేట్ కోసం వచ్చినప్పుడు సాధ్యమైనంత వరకు వారికి అనుకూలంగా ఆధార్ అప్‌డేట్ చేసి పంపించాలని ఆదేశాలు ఇస్తాం.' అని తెలిపారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

కళ్యాణదుర్గం, ఆగస్టు 28(ఆంధ్రజ్యోతి):నియోజకవర్గంలోని 32 మంది బాధితులకు రూ.32.80 లక్షల సీఎం సహాయ నిధి చెక్కులను ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు గురువారం అందచేశారు. ఇందులో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

● కూడేరు: మండలానికి వివిధ గ్రామాలకు చెందిన 17 మంది బాధితులకు ముఖ్యమంత్రి సహాయ నిధి కింద దాదాపు రూ, 11,63,016 చెక్కులు మంజూరయ్యాయి. వాటిని అనంతపురంలోని ఆర్థిక శాఖ మంత్రి క్యాంపు కార్యాలయంలో టీడీపీ నేత పయ్యావుల శ్రీనివాసులు బాధితులకు అందజేశారు.

● బెళుగుప్ప : మండలంలోని తొమ్మిది మందికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద రూ. 5,03,296 చెక్కులు మంజూరయ్యాయి. వాటిని అనంతపురంలో టీడీపీ నాయకుడు పయ్యావుల శ్రీనివాసులుపంపిణీ చేశారు.


కూడేరు మండల వాసికి చెక్కు అందిస్తున్న టీడీపీ నేత పయ్యావుల శ్రీనివాసులు


వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

'మురుగునీటి సమస్య పరిష్కరించండి'

తాడిపత్రి, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 11వ వార్డులోని పోరాటకాలనీలో నెలకొన్న మురుగునీటి సమస్యను తీర్చాలని మున్సిపల్ అధికారులకు సీపీఐ పట్టణ కార్యదర్శి చిరంజీవి యాదవ్ వినతిపత్రం అందజేశారు. మురుగు కాలవల్లో పూడిక తీయకపోవడంతో మురికినీరు రోడ్లపైన ప్రవహిస్తోందన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు శ్రీరాములు, నాగేంద్ర, అబ్రహాం, రత్నమయ్య, సావిత్రమ్మ ఉన్నారు.

వణికిస్తున్న విషజ్వరాలు


జ్వరాలతో చికిత్స కోసం వచ్చిన రోగులు

యాడికి, ఆగస్టు28(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో వస్తున్న మార్పుల కారణంగా ప్రస్తుతం విష జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఏ ఇంటిలో చూసినా ఒకరు.. ఇద్దరు.. జ్వరాలతో బాధపడుతున్నారు. స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఓపీ వారు సుమారు 150 దాకా ఉంటే అందులో 50 శాతం మంది జ్వర బాధితులే. అలాగే రాయలచెరువు ప్రభుత్వ ఆసుపత్రి, ప్రైవేట్ క్లినిక్‌లూ జ్వర బాధితులతో కిటకిటలాడుతున్నాయి. ప్రైవేట్ క్లినిక్‌ల్లో రక్తపరీక్షల పేరుతో దోపీడీ చేస్తున్నారు. దీనిపై యాడికి ప్రభుత్వ వైద్యశాల డాక్టర్ పరమేశ్వర్ మాట్లాడుతూ.. వాతావరణంలో మార్పుల కారణంగా జ్వరాలు వస్తున్నాయని, అందరూ కాచివడబోసిన గోరు వెచ్చని నీటిని తాగాలని తెలిపారు.